# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
28-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 126

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కేంద్ర విద్యా శాఖ మంత్రిగా చిన్నమ్మ!




ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఛాన్స్

ఢిల్లీ పెద్దల మదిలో పురందేశ్వరి

ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశం

బిజెపిలో సుదీర్ఘకాలం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఏపీ ఎంపీకి అవకాశం ఇస్తారా? దగ్గుబాటి పురందేశ్వరి రేసులో ఉన్నారా? పార్టీ హై కమాండ్ ఆమెను గుర్తించిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జంతర్ మంతర్ వద్ద జెన్ జి ఉద్యమం నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జనతా కాక్రోచ్ ఉద్యమంలో భాగంగా.. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ పదవిని వదులుకున్నారు. దీంతో విద్యా శాఖ మంత్రిని భర్తీ చేయాల్సిన అనివార్య పరిస్థితి కేంద్ర ప్రభుత్వంపై ఏర్పడింది.

2లో



## బోండా ఉమా ఔట్.. వంగవీటి రాధా ఇన్!

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతలు రాధాకృష్ణకు?

వివాదాస్పద వ్యాఖ్యలతో బోండా ఉమామహేశ్వరరావు పై టిడిపి వేటు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధానంగా కాపుల అంశం చుట్టూ ఇప్పుడు రాజకీయం నడుస్తోంది. గత కొద్ది కాలంగా కూటమిపై కాపు అస్త్రాన్ని ప్రయోగించింది

2లో



## ఆకివీడులో రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్!

సుప్రీంకోర్టు కీలక తీర్పు

అనుకున్నది సాధించిన రఘురామకృష్ణంరాజు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు అనుకున్నది సాధించారు. పట్టు వదలని

2లో

# రంగనాథ్‌ను తీసేయండి!

హైడ్రా కమిషనర్ గా మరొకరిని నియమించండి

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు సిఫారసు

రంగనాథ్ పదే పదే కోర్టును ధిక్కరిస్తున్నారు

కొనసాగిస్తే చట్టబద్ధమైన పాలనకు ప్రమాదం

ప్రభుత్వానికి సూచించిన జస్టిస్ అనిల్ కుమార్

రంగనాథ్ క్షమాపణలు.. తిరస్కరించిన హైకోర్టు



హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ పై హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగనాథ్ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని, పదే పదే కోర్టు తీర్పుల ధిక్కరణకు పాల్పడున్నారని మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీ ర్యాంకు కలిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి తన చర్యల ద్వారా న్యాయవ్యవస్థ గౌరవ మర్యాదలను అపఖ్యాతి పాలు చేసేలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించింది. ఆయనను అలాగే కొనసాగిస్తే రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపింది. అందుకే రంగనాథ్ ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి వెంటనే తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించింది.

2లో



# జెన్ జీతో బిజెపి గ్రాఫ్ తగ్గిందా?!

సంబరాలు చేసుకుంటున్న విపక్షాలు

రాజకీయం మరక అంటకుండా ఉద్యమం

ఎన్డీఏ అప్రతిహస విజయాలకు బ్రేక్

అన్ని రాజకీయ పార్టీలకు ఇది హెచ్చరిక

దేశవ్యాప్తంగా బిజెపి గ్రాఫ్ తగ్గుతోందా? కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో జరిగిన ఉద్యమం బిజెపిని పలుచన చేసిందా? ఎన్డీఏకు ఎదురు దెబ్బ ఖాయమా? పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే చర్చ నడుస్తోంది. భారత రాజకీయాల్లో ఎప్పటి వరకు జరిగిన ప్రజా పోరాటాలు వేరు. రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి సంఘాల అనుబంద విభాగాలు సంప్రదాయ శైలిలో తమ పోరాటాలు చేసేవి. కానీ దేశ చరిత్రలో తొలిసారిగా ఎలాంటి రాజకీయ జెండాలు, అనుబంధ గుర్తులు లేకుండా.. కేవలం తమ భవిష్యత్తు కోసం కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో జెన్ యువత సాధించిన విజయం సరికొత్త అధ్యాయం.

2లో

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** అయితే ప్రతిపక్ష పార్టీలకు ఈ ఉద్యమం ఒక వరంగా మారింది. అప్రతిహాసవిద్యాలతో ముందుకు వెళుతున్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏకు ఇది ఒక్క చెంపపెట్టు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సాధించుకోవడం.. ఈ జెన్ జీ ఉద్యమం సాధించిన తొలి పోరాటం అయితే..



## తెలంగాణలో 31 లక్షల ఓట్లు గల్లంతు!

సర్ ప్రక్రియలో గుర్తింపు

సవ్యంగా చేయలేదంటున్న రాజకీయ పార్టీలు

క్షేత్రస్థాయిలో ఓట్లు పోతాయని ప్రజల్లో ఆందోళన

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో భారీగా ఓట్లు గల్లంతుకానున్నాయి. సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా.. క్షేత్రస్థాయిలో అందుబాటులో లేని దాదాపు 31 లక్షల ఫారంలను సర్వే బృందాలు గుర్తించాయి. ప్రధానంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్,



## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు

డిసప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి,జూలై27(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు.

3లో



## పంజాబ్‌లో మళ్లీ రైతుల ఆందోళన

ఎన్నికల మందు బిజెపికి కొత్త తలనొప్పి

## పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత..

యశోదా ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్!

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శన్ రెడ్డి

అరగంట పాటు ఆసుపత్రిలో గడిపిన వైద్యులు

మెదడు పనితీరు సాధారణ స్థితికి రావాల్సి ఉందన్న వైద్యులు

2లో





# జెన్ జీతో బిజెపి గ్రాఫ్ తగ్గిందా?!

(మొదటి పేజీ తరువాయి)

**బిజెపి మార్కు పాలిటిక్స్ కు తొలిబ్రేట్ పడినట్టే.**

లి విపక్షాల ప్రయత్నం ఫలించలే.. అలాగని దేశంలో ఇతర రాజకీయ పక్షాలు బలపడలేదు ఈ ఉద్యమం ద్వారా. దీనిని ఒక రాజకీయ లబ్ధిగా మార్చుకోవాలన్న ప్రయత్నం కూడా ఫలించే ఛాన్స్ లేదు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలు, పేపర్ లీకేజీల రచ్చతో విసిగిపోయిన విద్యార్థులు ఈసారి సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతల మాటలు నమ్మలేదు. ప్రతిపక్షాలు ఈ సమస్యను తమ రాజకీయాల అద్దెకి వాడుకోవాలని చూసిన ప్రతిసారి జెన్ జి లు దూరంగా ఉంచారు. ఇది మా భవిష్యత్తు పోరాటం.. ఇక్కడ రాజకీయరచ్చవద్దు అని తేల్చి చెప్పారు. కేవలం పారదర్శకత, జవాబు దారి తనం డిమాండ్ తో సాగిన ఈ నాన్ పొలిటికల్ ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం చిన్న పోయిందని చెప్పవచ్చు. రాజకీయ పార్టీల రంగులు పూసి ఆందోళనలను దిగజార్చి అవకాశం లేకపోవడం ఈ ఉద్యమం అతిపెద్ద బలం గా మారింది.



**ముందుగానే ముప్పు గ్రహించిన మోడీ..**

అయితే ఇప్పటివరకు రాజకీయ వ్యూహంలో ఆరితేరిపోయిన కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోడీ ఈ ఉద్యమంతో ముప్పును ముందుగానే గుర్తించారు. ఒక రాజకీయ పార్టీ ధర్నా చేస్తే దానిని ఒక ఎన్నికల స్టంట్ అని చిత్రీకరించే ప్రయత్నం చేస్తుంది అధికార పార్టీ. కానీ స్వచ్ఛమైన మనసులతో తమ కష్టానికి ప్రతిఫలం కోరుతూ వీధిలోకి వచ్చిన లక్షలాది మంది అభ్యర్థుల ఆవేదనను ఏ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయలేదు. రాబోయే రోజుల్లో దేశంలోనే అతిపెద్ద ఓటు బ్యాంకు గా మారబోతున్న ఈ జన్ జీ ఓటర్ల ఆగ్రహానికి గురైతే కలిగే నష్టాన్ని ముందుగానే అంచనా వేశారు నరేంద్ర మోడీ. అందుకే తన క్యాబినెట్లో ఉన్న విద్యాశాఖ మంత్రి తో రాజీనామా చేయించి.. నైతికతను గుర్తు చేయించారు. గతంలో రైతుల పోరాటాన్ని సకాలంలో గుర్తించి వ్యవసాయ బిల్లులను ఎలా వెనక్కి తీసుకున్నారో.. ఇప్పుడు జనతా కాక్రోచ్ ఉద్యమానికి సైతం అలానే భావించి తన క్యాబినెట్ సహచరుడు రాజీనామా చేయించారు. అయితే ఇప్పటివరకు ఇలాంటి వివాదాలతో పాటు ఉద్యమాలను హ్యాండిల్ చేసింది భారతీయ జనతా పార్టీ. అయితే తాజా ఉద్యమం మాత్రం బిజెపికి డ్యామేజ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం సైతం డ్యామేజ్ కంట్రోల్ చేసుకోగలిగింది.

# కేంద్ర విద్యా శాఖ మంత్రిగా చిన్నమ్మ!

భారతీయ జనతా పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ వస్తున్నారు పురందేశ్వరి. మొన్నటి ఎన్నికలకు ముందు ఆమె బిజెపి రాష్ట్ర పగ్గాలు అందుకున్నారు. తెలుగుదేశంతో పాటు జనసేనతో పొత్తులో కీలకంగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీకి ఏపీలో ఓట్లతో పాటు సీట్లు పెరిగేందుకు దోహదపడ్డారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉంటూనే రాజమండ్రి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆమెకు తప్పకుండా కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని అంచనా వేసుకున్నారు. కానీ వివిధ సమీకరణలో భాగంగా ఆ అవకాశం దక్కలేదు. ఒకానొక దశలో లోక్సభ డిప్యూటీ స్పీకర్ పదవి ఆమెకు వస్తుందని భావించారు. అయితే ఇప్పుడు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెకు అవకాశం ఉంటుందన్న ప్రచారం ఉంది. ఇంతలోనే ఇప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఆమెకు ఛాన్స్ ఇస్తారన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.

**రెండుసార్లు మంత్రిగా..**

తెలుగుదేశం పార్టీలో తన భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు తో కలిసి పనిచేశారు పురందేశ్వరి. కానీ చంద్రబాబుతో తలెత్తిన విభేదాలతో 2003లో ఆ పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి గెలిచారు. 2009లో సైతం విజయం సాధించారు. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో బిజెపిలో చేరారు పురందేశ్వరి. ఆ ఎన్నికల్లో పొత్తులో భాగంగా రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో సైతం పోటీ చేశారు కానీ ఓటమి తప్పలేదు. 2024లో పొత్తులో భాగంగా రాజమండ్రి నుంచి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. కేంద్ర మంత్రివర్గంలో స్థానాన్ని ఆశించారు. కానీ ఇప్పుడు అది సాధ్యమయ్యేలా ఉంది. కేంద్ర విద్యా శాఖ మంత్రిగా అవకాశం ఇస్తారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి..

# ఆకివీడులో రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్!





విక్రమార్కుడుగా ఆయన చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు లో వివాదాస్పదంగా మారిన రామాలయ పునర్నిర్మాణ వ్యవహారానికి ఎట్టకేలకు ఎండ్ కార్డ్ పడింది. ఆకివీడులో ప్రభుత్వ స్థలంలో రామాలయాన్ని నిర్మించడానికి సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది. రామాలయ నిర్మాణానికి గతంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన నిరంతర పత్రం పూర్తిగా చట్టబద్ధమైనది అని సమర్థిస్తూ.. ఆలయ నిర్మాణ పనులు కొనసాగించుకోవచ్చు అని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న సస్పెన్షన్ వీడిపోయింది.

**అనుకున్నది సాధించారు..**

గత కొంతకాలంగా ఈ ఆలయ నిర్మాణ విషయంలో వివాదాస్పదంగా మారారు రఘురామకృష్ణంరాజు. కానీ రామాలయ నిర్మాణంలో మాత్రం పట్టుదలతో ముందుకు వెళ్లారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి కూడా ఆయన పై ఒత్తిడి పెరిగినట్లు ప్రచారం నడిచింది. అనవసరంగా దళితులతో ఇబ్బందులు వస్తాయని కొందరు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు కూడా ప్రచారం జరిగింది. కొందరు దళిత సంఘాల నేతలు ఈ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని కూడా చెప్పుకొచ్చారు. ప్రధానంగా హిందుత్వవాదంతో రఘురామకృష్ణంరాజు ముందుకు సాగుతున్నట్లు అర్థం అవుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఇక్కడ రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వడం.. ఒక విధంగా రఘురామకృష్ణం రాజుకు ఉపశమనం కలిగించినట్టే.

**వివాదం ఇది**

ఆకివీడు పెద్దపేటలోని ప్రభుత్వ స్థలంలో దశాబ్దాలుగా పురాతన రామాలయం ఉంది. దానిని పునర్ నిర్మించేందుకు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ముందుకు వచ్చారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ నుంచి నిబంధనల ప్రకారం నిరభ్యంతర పత్రం పొందారు. శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఆ స్థలంలో ఎలాంటి మతపరమైన నిర్మాణాలు చేపట్టకూడదని.. అక్కడ గొంతెనమ్మ గుడి ఉందంటూ స్థానికంగా కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. రామాలయ నిర్మాణం వల్ల ఇతరుల మనోభావాలు దెబ్బతింటాయి అంటూ ముందుగా ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ పై సమగ్ర విచారణ చేపట్టిన హైకోర్టు.. అన్ని రకాల అనుమతులు, రెవెన్యూ రికార్డులు సరిగ్గా నే ఉన్నాయని స్పష్టం చేస్తూ ఆ పిటిషన్ ను డిస్పోజ్ చేసింది. అయితే హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఆలయ నిర్మాణం జరుగుతోందని.. అక్కడ దళిత వర్గాలు పూజించే గొంతెనమ్మ ఆలయం ఉందనే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను యథాస్థితిలో కొనసాగించాలని.. అందుకు సంబంధించి తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# తెలంగాణలో 31 లక్షల ఓట్లు గల్లంతు!

ఫారిన్ కేటగిరి కింద వర్గీకరించి తొలగింపునకు సిద్ధపడుతున్నారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలోని ఆదివారం నాటికి 51% ఎనుమరేషన్ వారాల డిజిటలైజేషన్ పూర్తి అయ్యింది. ఇప్పటివరకు 4.21 లక్షల మందిని ఈ జాబితాలో చేర్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఆగస్టు మూడు నాటికి ఎన్యుమరేషన్ దశను పూర్తి చేయాలనే లక్ష్యంతో బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు వేగవంతం చేస్తున్నారు. సరైన తనిఖీలు జరగక ప్రతి పోలింగ్ బూత్ లో వందలాదిమంది అర్హులైన ఓటర్లు.. తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

**రాజకీయ పార్టీల ఫోకస్..**

ఆది నుంచి ఈ సర్ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. అయితే సరైన నిబంధనలు, ప్రామాణిక ప్రక్రియలను పాటించకుండానే ముందస్తుగా చాలామంది ఓటర్లను ఏఎస్డిడిఎఫ్ జాబితాలో చేర్చుతున్నట్లు పలు నియోజకవర్గాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆగస్టు మూడు నాటికి ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంతో అధికారుల నుంచి వస్తున్న తీవ్ర ఒత్తిడి వల్ల.. బి ఎల్ వోలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లాలని నిబంధనను పక్కన పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి బూత్ లో సుమారు 300 నుంచి 600 మంది



ఓటర్లు ఇంకా ఫారంలు అందుకోలేదని.. దీంతో వీరంతా తొలగింపు జాబితాలోకి వచ్చి ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

**తీవ్రమైన అభ్యంతరాలు..**

తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియపై కాంగ్రెస్ తో పాటు భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమయం అందుబాటులో ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండా తొందరపాటుగా సంతకాలు చేయడాన్ని పలు పార్టీల బిఎల్ఎలు నిరాకరిస్తున్నారు. ఈ విషయంపై ఎన్నికల నమోదు అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. అర్హులైన ఏ ఒక్క వాటర్ కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ వస్తోంది తెలంగాణ రాజకీయ పార్టీల నుంచి. అయితే రికార్డు స్థాయిలో లక్షల ఓట్లు గల్లంతవుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత..

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ ఆసుపత్రికి వెళ్లారు. దాదాపు అర్ధగంట పాటు అక్కడే ఉండి వైద్యులను అడిగి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.దప్రస్తుతం సుదర్శన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని కేసీఆర్ కు వైద్యులు వివరించారు. ఆయన అవయవాలన్నీ సరిగ్గా పనిచేస్తున్నాయని, మెదడు పనితీరు సాధారణ స్థితికి రావలసి ఉందని, దీనిపై స్పష్టత రావడానికి మరో 48 గంటల సమయం పడుతుందని తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎంత ఖర్చయినా సరే మెరుగైన వైద్యం అందించి పూర్తి కోలుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్యుల కృషి, దైవానుగ్రహం, ప్రజల ప్రార్థనలతో ఆయన త్వరలోనే కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఏం చేస్తారో ఏమో తెలీదు.. మా పెద్ది సుదర్శన్ రెడ్డిని మాత్రం కాపాడండి" అని వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.



# రంగనాథ్‌ను తీసేయండి!

మల్కాజిగిరి మండలం లోతుకుంట సర్వే నెంబర్ 1, 2 లలో శాంతాశ్రీరాం కనస్ట్రక్షన్స్ కంపెనీకి సంబంధించిన 40 ఎకరాల ప్రైవేటు పట్టా భూమిలోకి వెళ్లరాదన్న ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించడంపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయి. గత విచారణల సందర్భంగా హైడ్రా కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. సైన్యాన్ని సైతం మోహరిస్తామని హెచ్చరించింది. సోమవారం ఈ వ్యాజ్యాలపై జస్టిస్ జె.అనిల్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరు కాకుండా హైకోర్టుకు లిఖితపూర్వక క్షమాపణలు తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేశారు. తనపై పిటిషనర్ చేసినవన్నీ తప్పుడు ఆరోపణలని, ఆ భూమిలోకి హైడ్రా ప్రవేశించలేదని అఫిడవిట్ లో తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శనరెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ధిక్కరణపై రంగనాథ్ క్షమాపణలు తెలిపినందున కేసులను ముగించాలని కోరారు. అయితే రంగనాథ్ క్షమాపణలను ధర్మాసనం తిరస్కరించింది. వీలైనంత వేగంగా ఆయనను హైడ్రా కమిషనర్‌గా తొలగించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేసింది.

**హెచ్చరించినా..లెక్క చేయడంలేదు**

"ప్రభుత్వ ఆస్తులు, నాలాలు, జల వనరులను రక్షించే మంచి ఉద్దేశంతో హైడ్రా ఏర్పాటైంది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ ఏడాదిన్న పదవీకాలంలో ఆయనపై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదయ్యాయి.







ఇలాంటి అధికారిని ఇంకా పదవిలో కొనసాగిస్తే న్యాయ వ్యవస్థ గౌరవ మర్యాదలకు, చట్టబద్ధమైన పాలననకు ప్రమాదం తలెత్తుతుంది. అనేకసార్లు ఆయనను హెచ్చరించినా.. పెడచెవిన పెడుతున్నారు. మొదటిసారి కోర్టు ధిక్కరణ తప్పులను క్షమించవచ్చని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పేర్కొంది. ప్రస్తుత కేసులో ఏకంగా మూడుసార్లు కోర్టు తీర్పులను ఉల్లంఘించారు. ఇది ఆయన అహంకారపూరిత స్వభావాన్ని తెలియజేస్తోంది. పిటిషనర్ భూమిలోకి ప్రవేశించబోమని అడ్వకేట్ జనరల్ స్వయంగా ఇచ్చిన అండర్ టేకింగ్‌ను కూడా ఆయన పాటించలేదు. అధికారాన్ని ఏకపక్షంగా ప్రయోగిస్తే ప్రమాదకరంగా మారుతుంది. అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత ఈ కోర్టు రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి రిలీవ్ చేయాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేస్తోంది " అని ధర్మాసనం పేర్కొంది.

**న్యాయ సలహా తీసుకున్నాకే అప్పీలుకు**

హై కోర్టు తీర్పుపై ప్రభుత్వం న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంతరెడ్డి దృష్టికి సోమవారం కోర్టు తీర్పు విషయం వచ్చింది. హైడ్రాను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో, చెరువుల పునరుద్ధరణలో, పార్కులు, ఆటస్థలాలను కబ్జాల నుంచి కాపాడటంలో హైడ్రా కీలక పాత్ర పోషించిందని ప్రభుత్వం భావిస్తోంది. హైకోరు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ తుది నిర్ణయం ఏమై ఉంటుందా అనేది ఆసక్తిగా మారింది.






# రాజన్న

# మీరే దిక్కు..


## అక్రమ కోళ్ల ఫారాలపై చర్యలు తీసుకోండి..



### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రజల వినతి

### అనుమతులు లేవని అధికారులు చెబుతుంటే నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి?

### మాకు న్యాయం చేయండి” అంటూ గ్రామస్తుల ఆవేదన




**నల్లగొండ నిఘా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్)**


జిల్లాలోని మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామంలో, అక్రమ కోళ్ల ఫారాల? నిర్మాణాలపై గ్రామస్తుల ఆవేదన రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది.! గ్రామంలో నిర్మాణాలు నిలిపివేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో, తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి, దామెర భీమనపల్లి ప్రజలు తమ గోడును వినిపించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి, గ్రామంలో జరుగుతున్న పరిణామాలను పూర్తిగా వివరించి, ఈ వ్యవహారంపై జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం..

ఒకవైపు గ్రామపంచాయతీ, మండల అధికారులు నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతులు లేవని, లిఖితపూర్వకంగా తెలియజేస్తుండగా, మరోవైపు అదే ప్రాంతంలో భారీ ఎత్తున కోళ్ల షెడ్లు, కార్మికుల నివాస గదుల నిర్మాణాలు, నిరాటంకంగా కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.! ప్రభుత్వ శాఖల నుంచే అనుమతులు లేవని సమాధానాలు వస్తుంటే, పనులు మాత్రం ఆగకపోవడం, ప్రజల్లో తీవ్ర అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018 లోని సెక్షన్ 113, 114తో పాటు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను ప్రస్తావిస్తూ నిర్మాణాలపై, నోటీసులు జారీ చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని హెచ్చరిస్తూ, అవసరమైన అనుమతులు పొందాలని నోటీసుల్లో

### నోటీసులు ఇచ్చినా పనులు ఆగలేదన్న ఆరోపణలు


పేర్కొన్నప్పటికీ, ఆ తర్వాత కూడా నిర్మాణాలు ఎక్కడా ఆగలేదని ప్రజలు అంటున్నారు. ప్రతిరోజూ డజన్ల కొద్దీ కార్మికులతో పనులు కొనసాగుతున్నా, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యక్షంగా వెళ్లి నిలిపివేయడానికి, చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇవ్వడం వరకే అధికారుల బాధ్యతగా పరిమితమైందా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలకు, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి వచ్చిన సమాధానంలో, సంబంధిత కోళ్ల ఫారానికి గ్రామపంచాయతీ నిర్మాణ అనుమతి ఇవ్వలేదని, కేవలం ఇతర శాఖల అనుమతుల కోసం, అవసరమైన నిరభ్యంతర పత్రం మాత్రమే జారీ చేసినట్లు పేర్కొన్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమాధానం వెలుగులోకి వచ్చిన తర్వాత గ్రామంలో



మరోసారి చర్చ మొదలైంది.! నిర్మాణ అనుమతి లేదని అధికారిక రికార్డులే చెబుతున్నప్పుడు, నిర్మాణాలు కొనసాగడానికి అవకాశం ఎలా కలిగింది? వాటిని నిలిపివేయాల్సిన బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఉన్న కోళ్ల ఫారం కారణంగా గ్రామంలో దుర్వాసన, ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాల సమస్య తీవ్రంగా పెరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు అధికమవుతున్నాయని, భవిష్యత్తులో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, గ్రామపంచాయతీ చట్టాల అమలు అన్నీ సమానంగా ముఖ్యమైన అంశాలేనని, వీటిని కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రశ్నిస్తూ అధికారులకు ఫిర్యాదులు చేసిన, కొంతమంది గ్రామస్తులపైనే పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేయించారని కూడా ఆరోపనలు వినపడుతున్నాయి. ఈ ఆరోపణలపై కూడా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఎమ్మెల్యే రాజన్న జోక్యం.. ప్రజలకు అందనున్న న్యాయం

తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. తమ గ్రామంలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అధికారులు స్పందించడం లేదని, ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని గత కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, చట్టవిరుద్ధంగా నిర్మాణాలు జరిగి ఉంటే, వెంటనే నిలిపివేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, తమ గ్రామానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు పడుతున్న ఈ ఇబ్బందులు నేడు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ అంశంపై సంబంధిత శాఖలు స్పష్టమైన వివరణ ఇచ్చి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాయా? లేక ప్రజల సందేహాలు మరింత పెరుగుతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.. ఏదేమున్నా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చర్యలతో, దామెరభీమనపల్లి ప్రజల కష్టాలు తీరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు..




## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం.

# బోండా ఉమా ఔట్..
# వంగవీటి రాధా ఇన్!

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ముద్రగడ పద్మనాభం మృతి తర్వాత దానిని మరింత తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు చేసిన కామెంట్స్ పార్టీలో కలకలం రేపాయి. ముద్రగడ పద్మనాభం ను తక్కువ చేసి తెలుగుదేశం 2019లో మూల్యం చెల్లించుకుందని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ వివాదాస్పద నేత అంబటి రాంబాబును పక్కన పెట్టుకొని చేసిన ఈ వ్యాఖ్యలను టిడిపి తీవ్రంగా పరిగణించింది. బోండా ఉమామహేశ్వరరావుకు నోటీసులు జారీ చేసింది. అయితే ఈ విషయంలో పార్టీ లైన్ దాటి బోండా ఉమామహేశ్వరరావు ముందుకు వెళితే కఠిన చర్యలు తీసుకునేందుకు టిడిపి హై కమాండ్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరం అనుకుంటే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతలను వంగవీటి రాధాకృష్ణకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ నియోజకవర్గంలో పై నమ్మకం..**

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు వంగవీటి రాధాకృష్ణ. ఆయన సొంత నియోజకవర్గం కూడా అదే. వంగవీటి కుటుంబానికి ప్రత్యేక అనుచర గణం ఉంది ఆ నియోజకవర్గంలో. ఒకప్పుటి వంగవీటి మోహన్ రంగ అనుచరుడుగా ఉన్న బోండా ఉమామహేశ్వరరావు తదనంతర పరిణామాల్లో టిడిపికి దగ్గరయ్యారు. అలా 2014లో టిడిపి తరఫున గెలిచారు. 2019 ఎన్నికల్లో సైతం 30 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో రెండోసారి గెలిచారు. మంత్రి పదవి ఆశించారు. కానీ వివిధ సమీకరణల్లో దక్కలేదు. అందుకే ప్రభుత్వంతో పాటు పార్టీ పై భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తూ కామెంట్లు చేస్తున్నారు. ఒకవేళ ఆయన పార్టీ క్రమశిక్షణ కట్టు దాటిన మరుక్షణం వంగవీటి రాధాకు అక్కడ నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రకటిస్తారని ప్రచారం సాగుతోంది.

**బోండా కట్టు దాటితే..**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకున్నారు వంగవీటి రాధాకృష్ణ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అది వీలుపడలేదు. 2019లో ఎలాగైనా అక్కడి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయాలని బలంగా భావించారు. జగన్మోహన్ రెడ్డి అంగీకరించకపోయేసరికి అసంతృప్తితో టీడీపీలో చేరారు. ఆ పార్టీ తరఫున ప్రచారం కూడా చేశారు. 2019లో టిడిపి ఓడిపోయిన అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. 2024 ఎన్నికల్లో కూడా ఆ నియోజకవర్గ టికెట్ ఆశించారు. కానీ సిట్టింగ్ అభ్యర్థిగా ఉన్న బోండా ఉమామహేశ్వరరావు కాదని రాధాకృష్ణకు ఇవ్వలేకపోయారు చంద్రబాబు. అయితే ఇప్పుడు బోండా ఉమామహేశ్వరరావు పార్టీ నుంచి బయటకు వెళ్లిన మరుక్షణం వంగవీటి రాధాకు అక్కడ బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# పంజాబ్‌లో మళ్లీ రైతుల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

చండీఘడ్,: పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర పర్యటనతో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అంశాలను తెరపైకి తీసుకువచ్చి, నూతన రాజకీయ ఒరవడిని సృష్టించాలని భావించిన బీజేపీకి.. ప్రస్తుతం ఇలా రైతులు ఆందోళనకు దిగడం సవాల్‌గా మారింది. భారత్-అమెరికా ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు మరోసారి శంభు సరిహద్దు వద్ద గుమిగూడారు. వారిని ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడి పరిస్థితులు 2020-21 వ్యవసాయ చట్టాల ఉద్యమం, 2024 అన్నదాతల ఆందోళనలను గుర్తుచేస్తున్నాయి. ఇరుదేశాల మధ్య ఈ ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే.. అమెరికా నుంచి భారీ సబ్సిడీలతో వచ్చే వ్యవసాయ, పాల ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశముందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఫలితంగా.. దేశంలో రైతు ఉత్పత్తులకు ధరలు తగ్గి ఆదాయం దెబ్బతింటుందని వారు వాపోతున్నారు. మరోవైపు.. ఒప్పందం పూర్తయ్యే వరకు వేచి చూడాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఆ తర్వాత రైతుల ప్రయోజనాలను కాపాడుకునే అవకాశం ఉండదని రైతు సంఘాలు వాదిస్తున్నాయి. ఈ అంశంపై పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ స్పందిస్తూ.. ఇప్పటివరకు ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని, రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అన్నదాతలు, పశుపోషకుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రధాని మోదీ కూడా హామీ ఇచ్చారన్నారు. అయితే.. ఈ ప్రతిపాదిత ఒప్పందాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబడుతోంది. ఈ డీల్ ద్వారా వ్యవసాయం, పాల పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోపిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ డీల్‌ను రైతులపై 'అతిపెద్ద ద్రోహం'గా అభివర్ణిస్తూ.. ముసాయిదా ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తోంది. అటు.. శిరోమణి అకాలీదళ్ కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలిపింది. పంజాబ్‌లో రైతులు మరోసారి ఇలా ఉద్యమ బాటపట్టడంతో ఎన్నికల వేళ అన్నదాతల సమస్యలే ప్రధాన చర్చాంశంగా మారే అవకాశం కనిపిస్తోంది. 2020లోనూ ఇదే తరహాలో సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన రైతులు.. మరలా ఇప్పుడు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందానికి ప్రతికూలంగా ఆందోళనలకు దిగడం విశేషం. ఇదిలాగే తీవ్రరూపం దాల్చితే విదేశీ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశంలో జరిగే తొలి భారీ రైతు ఉద్యమం కానుంది.

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది.

## ఆస్తులు తాత్కాలికం, త్యాగమే శాశ్వతం

**సంపద అనగానే సాధారణంగా మన మనసులో మెదిలేది బంగారం, భూములు, బ్యాంకు బ్యాలెన్సులు, వాహనాలు, మరియు పెద్ద భవంతులు. ఇవన్నీ భౌతిక ప్రపంచంలో ఒక మనిషి హోదాను, ఆర్థిక శక్తులను కొలిచే సాధనాలుగా మారిపోయాయి. కానీ మన పూర్వీకులు, మన ప్రాచీన సంస్కృతి, జీవన వేదం పదే పదే చెప్పిన మాట ఒక్కటే నిజమైన సంపద అంటే త్యాగం. ఇది కేవలం ఏదో పుస్తకాల్లో రాసి ఉన్న నీతివాక్యం కాదు, తరతరాలుగా మన సమాజాన్ని నిలబెట్టిన ఒక శక్తివంతమైన జీవన సూత్రం. డబ్బు చేతులు మారుతుంది, ఆస్తులు కరిగిపోతాయి, సమయం మారే కొద్దీ భౌతిక సంపద ప్రాధాన్యత తగ్గిపోవచ్చు. కానీ ఒక త్యాగం మిగిల్చే మానవీయ విలువ, పొందే ఆత్మసంతోషం శాశ్వతంగా నిలిచిపోతాయి.**



అందుకే ఈ ఆధునిక సమాజంలో ఈ ప్రశ్నను మరింత లోతుగా పరిశీలించడం ఎంతైనా అవసరం నిజంగానే త్యాగమే గొప్ప సంపదా?త్యాగం అంటే చాలామంది అనుకునేట్లు కేవలం ఏదో ఒక వస్తువునో లేదా హక్కునో వదులుకోవడం మాత్రమే కాదు. అది తనకంటే ఇతరుల శ్రేయస్సును, భావోద్వేగాలను ముందు పెట్టే ఒక అత్యున్నత మనస్తత్వం. తన సౌకర్యాన్ని, తన వ్యక్తిగత కోరికలను, తన స్వార్థాన్ని పక్కన పెట్టి, మరొకరి మంచి కోసం, సమాజ పురోగతి కోసం, దేశ సంక్షేమం కోసం నిలబడటమే త్యాగం యొక్క నిజమైన అర్థం. ఇది బలవంతంగా, ఒత్తిడితో చేసేది కాదు; హృదయపూర్వకంగా, ప్రేమతో, బాధ్యతతో చేసేది. అలాంటి స్వచ్ఛమైన త్యాగంలోనే వర్ణించలేని ఒక గొప్ప శక్తి, పవిత్రత దాగి ఉంటాయి.మన జీవితంలో మొదటి త్యాగపు పాఠం నేర్పేది మన తల్లిదండ్రులే. ఒక తల్లి తన నిద్రాహారాలను, తన ఆరోగ్యాన్ని, తన సొంత కలలను సైతం పిల్లల భవిష్యత్తు కోసం చిరునవ్వుతో త్యాగం చేస్తుంది. అలాగే ఒక తండ్రి తన వ్యక్తిగత ఆశలను, సంతోషాలను అణచుకుని, కుటుంబ అవసరాలను తీర్చడం కోసం రేయింబవళ్లు కష్టపడతాడు. ఇలాంటి చిన్న చిన్న త్యాగాల పునాదులపైనే ప్రతి కుటుంబం బలంగా నిలబడుతుంది. పిల్లలు పెద్దయ్యాక వెనుదిరిగి చూసుకున్నప్పుడు, తల్లిదండ్రుల ఈ త్యాగమే వారికి అతిపెద్ద సంపదగా కనిపిస్తుంది. ఎందుకంటే ఆ త్యాగమే వారికి మంచి విద్యను, ఉన్నత విలువులను, సమాజంలో ఒక గౌరవప్రదమైన జీవితాన్ని అందించింది.మన స్వాతంత్ర్య సమరయోధులను తలచుకుంటే ఈ విషయం మరింత స్పష్టంగా అర్థమవుతుంది. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో మహా వీరులు తమ యవ్వనాన్ని, తమ కుటుంబ సుఖాలను, చివరికి తమ ప్రాణాలను సైతం దేశ విముక్తి కోసం అర్పించారు. స్వార్థంతో ఆలోచిస్తే వారికి వ్యక్తిగతంగా ఏమీ మిగలలేదు ఆస్తులు లేవు, హోదాలు లేవు. కానీ వారు తమ ప్రాణ త్యాగంతో మిగిల్చిన స్వేచ్ఛ అనే అపారమైన సంపదను నేటికీ కోట్లాది మంది భారతీయులు అనుభవిస్తున్నారు. వారి త్యాగం లేకపోతే మనం ఈరోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలిగేవారమా? వ్యక్తిగత లాభం లేకున్నా తరతరాలకు ప్రయోజనం చేకూర్చడమే త్యాగం యొక్క నిజమైన శక్తి.ఉపాధ్యాయులు, వైద్యులు, సరిహద్దు సైనికులు వీరంతా తమ రోజువారీ జీవితాల్లో ఎంతో కొంత త్యాగం చేస్తూనే ఉంటారు. ఒక మంచి ఉపాధ్యాయుడు తక్కువ ప్రాతిపదికన పనిచేస్తున్నప్పటికీ, అంకితభావంతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాడు. ఒక సైనికుడు తన కంటికి రెప్పలా చూసుకునే కుటుంబానికి సుదూరంగా ఉండి, తీవ్రమైన చలిలో, ఎండలో సరిహద్దుల్లో దేశాన్ని కాపాడతాడు. ఇటీవలి కోవిడ్ మహమ్మారి సమయంలో వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులు తమ సొంత ప్రాణాలను సైతం పణంగా పెట్టి రోగులకు సేవలందించిన దృశ్యాలు మనం ఎప్పటికీ మర్చిపోలేం. వీరందరి త్యాగాల పునాదిపైనే మన సమాజం ఈరోజు సురక్షితంగా, సజావుగా నడుస్తోంది. వీరికి పతకాలు రాకపోవచ్చు, రోజువారీ పత్రికల్లో పెద్ద వార్తలుగా రాకపోవచ్చు, కానీ వీరి సేవ సమాజానికి అమూల్యమైన సంపద.మన భగవద్గీత కూడా నిష్కామ కర్మ ను, అంటే ఫలితాన్ని ఆశించకుండా తన కర్తవ్యాన్ని నిర్వహించడాన్ని గొప్పగా కీర్తించింది. త్యాగం వెనుక ఉన్న తత్వజ్ఞానం కూడా అదే ప్రతిఫలం కోసం కాకుండా, కేవలం మానవతా ధర్మం కోసం పనిచేయడం. ఈ దృక్పథం మనిషిని స్వార్థపు ఆలోచనల నుండి బయటకు తీసుకువచ్చి, విశాలమైన మానవీయ దృక్పథాన్ని అందిస్తుంది. ధనం సంపాదించడం తప్పు కాదు, కానీ కేవలం డబ్బు, భౌతిక సుఖాల కోసమే జీవించడం అసంపూర్ణమైన జీవితం అవుతుంది. ఇతరుల కోసం త్యాగం చేసేవారు తమ జీవితంలో ఒక ప్రత్యేకమైన ఆత్మసంతోషాన్ని, ప్రశాంతతను పొందుతారు. ఆ సంతోషాన్ని ప్రపంచంలోని ఏ ధనంతోనూ కొనలేము.అయితే, త్యాగం అనే పేరుతో తనను తాను పూర్తిగా నిర్లక్ష్యం చేసుకోవడం లేదా నాశనం చేసుకోవడం సరైనది కాదు. ఆరోగ్యకరమైన త్యాగం అంటే తన ప్రాథమిక బాధ్యతలను నెరవేరుస్తూనే, ఇతరుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకోవడం. తనను తాను పూర్తిగా త్యజించి, తనకంటూ ఏ ఆలోచన, ఏ ఆధారం మిగుల్చుకోకుండా జీవించడం దీర్ఘకాలంలో వ్యక్తికి, సమాజానికి మంచిది కాదు. నిజమైన త్యాగం అనేది వివేకంతో, సమతూకంతో కూడుకున్నది అది ఎదుటివారికి సహాయం చేసేటప్పుడు తన ఉనికిని, తన సామర్థ్యాన్ని కూడా కాపాడుకునేలా ఉండాలి.చివరిగా చెప్పాలంటే, డబ్బు, ఆస్తులు, అధికారాలు అనేవి తాత్కాలిక సంపదలు మాత్రమే. అవి కాలంతో పాటు రూపాంతరం చెందుతాయి, కరిగిపోతాయి లేదా చేతులు మారతాయి. కానీ ఒక మనిషి చేసే త్యాగం మిగిల్చే ప్రేమాభిమానాలు, గౌరవం, సమాజంలో తెచ్చే మార్పులు ఇవి శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోతాయి. ఒక తల్లి త్యాగం పిల్లల హృదయాల్లో, ఒక సైనికుడి త్యాగం దేశ చరిత్ర పుటల్లో, ఒక ఉపాధ్యాయుడి త్యాగం విద్యార్థుల భవిష్యత్తు రూపంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాబట్టి త్యాగమే గొప్ప సంపదా? అని అడిగితే, నిస్సందేహంగా అవును అని చెప్పవచ్చు. ఎందుకంటే త్యాగం అనేది ఇచ్చేకొద్దీ పెరిగే ఒక అరుదైన, పవిత్రమైన సంపద ఇది ఇచ్చినవారికీ, పొందినవారికీ ఇద్దరికీ శాశ్వతమైన సంతృప్తిని, గౌరవాన్ని, ఆనందాన్ని అందిస్తుంది.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


## బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

### తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర



ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



# బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివల్లల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది.



# సీలింగ్ భూములకు రెక్కలు...

## చోద్యం చూస్తోన్న రెవిన్యూ అధికారులు

**కందుకూరు మండలంలో సీలింగ్ భూముల విక్రయాలు... అయినా మొద్దు నిద్రలో తహసిల్దార్**

**రైతులకు ఫామ్ 1 నోటీసులు ఇవ్వాలని ఆదేశించిన ఆర్డీవో**

**ఆర్డివో ఆదేశాలను భేఖాతరు చేసిన తహసిల్దార్**

**పులిమామిడి రెవెన్యూ పరిధిలోని పెద్దమ్మ తండాలో**

**సర్వే నెంబర్ 74, 75లలోని 28 ఎకరాల సీలింగ్**

**28 ఎకరాల సీలింగ్ భూములను విక్రయించిన లబ్ధిదారులైన రైతులు... కొనుగోలు చేసిన రియాల్టర్లు**

**సీలింగ్ భూముల క్రయ, విక్రయాలు చట్ట విరుద్ధం... రైతులకు సాగు చేసుకునే హక్కులను మాత్రమే కల్పించిన రెవిన్యూ చట్టం**

**సీలింగ్ భూములు అమ్మిన, కొనుగోలు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందే**

**సీలింగ్ భూములలో రియల్ వెంచర్ల ఏర్పాట్లకు సన్నాహాలు**

**అడ్డుకునే ప్రయత్నం చేసిన పంచాయతీ అధికారిని చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన రియాల్టర్**

( క్రైమ్ మిర్రర్ నిఘా ప్రతినిధి )

**కందుకూరు మండల పరిధిలో సీలింగ్ భూములకు రెక్కలు వచ్చాయి. లబ్ధిదారులైన రైతుల నుంచి నామమాత్రపు ధరకు రియాల్టర్లు ఏకంగా 28 ఎకరాల భూముల్ని కొనుగోలు చేశారు. ఈ విషయం తెలిసినప్పటికీ, సీలింగ్ భూములు క్రయ విక్రయాలను అడ్డుకోవలసిన కందుకూరు మండల తహసిల్దార్ చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీలింగ్ భూముల విక్రయాల అంశాన్ని మీడియా ప్రతినిధులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లగా, రైతులకు ఫామ్ 1 నోటీసులను ఇవ్వాలని కందుకూరు తహసిల్దార్ ను ఆదేశించారు. అయినా మండల తహసీల్దార్, ఆర్డీవో ఆదేశాలను బేఖాతరు చేస్తూ, రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, రియాల్టర్లకు వంత పాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి రెవెన్యూ సర్వేనెంబర్ 74, 75 లలోని 28 ఎకరాలు సీలింగ్ భూములను గతంలో రైతులకు కేటాయించారు. రెవిన్యూ సీలింగ్ చట్టం ప్రకారం పట్టాలు పొందిన అర్హులైన రైతులు ఈ భూములను సాగు చేసుకోవడానికి మాత్రమే హక్కులను కల్పించారు. ఈ భూముల క్రయ, విక్రయాలు రెవెన్యూ చట్టం ప్రకారం నేరమే కాకుండా, శిక్షార్హం. సీలింగ్ చట్టాన్ని రైతులు ఉల్లంఘించి రియాల్టర్లకు విక్రయించగా, రియాల్టర్లు ఈ భూములను కొనుగోలు చేసి, తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రెవిన్యూ రికార్డులలో పట్టా భూములుగా మార్చేందుకు పథక రచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సీలింగ్ భూములను కొనుగోలు చేసిన రియాల్డరు స్థానికంగా ఉన్న అటవీ భూములపై కూడా కన్ను వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా, అడ్డుకునే ప్రయత్నం చేసిన గ్రామపంచాయతీ సిబ్బందిని సైతం రియాల్టర్లు బెదిరించినట్లుగా బాధితులు అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల సీలింగ్ భూములు అన్యాక్రాంతమవుతున్నప్పటికీ కందుకూరు మండల తహసీల్దార్ తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, అందుకే ఆర్డిఓ ఆదేశాలను సైతం ఆయన లెక్క చేయడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విలువైన సీలింగ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా? లేదా?? అన్నది కందుకూరు మండలంలో హాట్ టాపిక్ గా మారింది. సమగ్ర ఆధారాలతో వరుస కథనాలు..

# బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

## తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర



ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# కోమటిరెడ్డి బ్రదర్స్ కు ఎమ్మెల్యే మందుల సామేలు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య .. మండల అధ్యక్షులు బోయ దేవేందర్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 27(క్రైమ్ మిర్రర్):** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కోమటిరెడ్డి బ్రదర్స్ కు భేషరతుగా క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయం లక్కారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు బోయ దేవేందర్ మాట్లాడుతూ అన్ని కులాల ఓట్లతో 50 వేల మెజార్టీతో గెలిచిన మందుల సామెల్ దళితుల కార్డుతో తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో కొత్త పంచాయతీ తీసుకువస్తున్నాడని అందుకు తుంగతుర్తిలోని 66 వేల దళితుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో రాజగోపాల్ రెడ్డి దయవల్లే టికెట్ వచ్చిందని చెప్పిన సామెల్ ఈరోజు ఎవరి దయా వల్ల టికెట్ రాలేదని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఎమ్మెల్యే తప్పును కప్పిపుచ్చుకోవడం వల్ల కులం ప్రస్తావన తీసుకొస్తున్నాడని అన్నారు. నియోజకవర్గంలో నిన్ను గెలిపించిన ఏ ఒక్క దళితునికి నువ్వు పదవులు ఇచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు.నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని అభివృద్ధి చేయకుండా నీ అభివృద్ధి కోసమే పాలన కొనసాగిస్తున్నావని విమర్శించారు. తుంగతుర్తి కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరగవద్దని అన్న రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలలో తప్పేముందో చెప్పాలని అన్నారు. మంత్రి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుని కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తే నీకు కలిగిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా నీ పెద్ద కొడుకు కి ఇచ్చినావు, రెండో కొడుకుకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నావు, నీ కొడుకులు నియోజకవర్గం లోని ఏ కార్యకర్తను, నాయకుడిని ఆదుకున్నారో చెప్పాలని అన్నారు. 20 సంవత్సరాలుగా కాంగ్రెస్లో నిక్కాస్ అయిన కార్యకర్తగా పనిచేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు పదవులు ఇవ్వకుండా, కాసుల కక్కుర్తి కోసం మండల అధ్యక్ష పదవులు అమ్ముకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ గారు, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు సుర్వి నర్సింహగౌడ్,కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.,





# అమ్మ లేని లోటు ఎవ్వరూ తీర్చలేనిది

## తల్లి వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సాయి రక్షా కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నెపు ప్రభు ముదిరాజ్ తల్లి వర్ధంతి సందర్భంగా ఆమె స్వర్గస్తులై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శంషాబాద్ పట్టణ కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద పేదలు, కార్మికుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మ లేని లోటు ఎవ్వరూ తీర్చలేనిది అంటూ తల్లి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం నర్రగిరి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా రాచమల్ల యాదగిరి, ఇండిగో ఎయిర్లైన్స్ మేనేజర్ అరుణ్ ముదిరాజ్, సుదర్శన్, గిలకరాజు పాల్గొన్నారు. అనంతరం పేదలకు, కార్మికులకు అన్నదానం చేసి మానవ సేవే మాధవ సేవ అనే సందేశాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా సాయి రక్షా కన్స్ట్రక్షన్స్కు చెందిన కార్మికులు సతీష్ ముదిరాజ్, లింగం యాదవ్, రాజు గౌడ్, మల్లేష్, అలాగే స్నేహితులు విజయ్, శ్రీనివాస్ చారి, దేవేందర్, శైలేందర్, మల్లేష్, రవి, సురేందర్, రాజు యాదవ్, ఉదయ్ కుమార్, కుంభోజు ప్రవీణ్ తదితరులు, బంధుమిత్రులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప సంప్రదాయమని, సమాజానికి సేవ చేయడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్టేనని పేర్కొన్నారు. కార్యక్రమం ఆప్యాయ వాతావరణంలో ముగిసింది.

# ఈడీ కమిటీ హామీలను వెంటనే అమలు చేయాలి





## రాజేంద్రనగర్ డిపోలో ఆర్టీసీ కార్మికుల ధర్నా

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూఎఫ్), సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ డిపో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం డిపో ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు సమస్యలకు సంబంధించిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఈడీ కమిటీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్. కృష్ణ మాట్లాడుతూ సమ్మె అనంతరం ఒప్పందంలో భాగంగా 29 సమస్యలను ఈడీ కమిటీ యూనియన్ నాయకులతో రెండు దఫాలుగా చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు పరిష్కారమైన అంశాలకే అమలు ఉత్తర్వులు జారీ చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే సర్క్యులర్లు జారీ చేసి అంగీకరించిన నిర్ణయాలను అమలు చేయాలని ఆయన కోరారు. 2026 మే 21న జరిగిన చర్చల ప్రకారం అలవెన్సులను 80 శాతం పెంచి జూలై నెల జీతాల నుంచే అమలు చేయాలని, బ్రెడ్ విన్నర్స్ స్కీమ్ కింద ప్రస్తుతం పనిచేస్తున్న వారందరినీ శాశ్వత ఉద్యోగులుగా రెగ్యులర్ చేయాలని, శాఖ పరీక్షల్లో ఉత్తీర్ణులైన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కమిటీని వెంటనే ఏర్పాటు చేసి అన్ని కార్మిక సంఘాల అభిప్రాయాలతో ప్రతిపాదనలు రూపొందించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్, హయ్యర్ పెన్షన్ అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2019 ఆర్టీసీ సమ్మె సందర్భంగా నమోదైన పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించి పనిభారాన్ని తగ్గించడం, మహిళా కార్మికుల ప్రత్యేక సమస్యలను పరిష్కరించడం, అన్ని రీజియన్లలో ప్రమోషన్లను పారదర్శకంగా అమలు చేయడం వంటి అంశాలను ఈడీ కమిటీ అంగీకరించిందని, వాటిని తక్షణమే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కార్మికులు తమ సమస్యలను వివరిస్తూ రూపొందించిన మెమోరాండంను డిపో మేనేజర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిపో ఎస్డబ్ల్యూఎఫ్ నాయకులు ఎం. సూర్యతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్--బుద్వేల్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్--బుద్వేల్ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27న తెల్లవారుజామున సుమారు 1 గంట ప్రాంతంలో, సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి రాజేంద్రనగర్ నుంచి బుద్వేల్ వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఇండియన్ గ్యాస్ గోడౌన్ దాటిన తర్వాత ఉన్న యూ-టర్న్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన టిఎస్09ఎఫ్‌బి4554 నంబర్ గల కారు అతడిని ఢీకొట్టింది. కారును సాయి నితిన్ అనే వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా, మద్యం మత్తులో నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ప్రమాదంలో బాధితుడికి తల, ఛాతీ, రెండు కాళ్లకు తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు నలుపు రంగు ప్యాంటు ధరించి ఉండగా, పైభాగంలో ఎలాంటి చొక్కా లేకుండా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గుర్తింపునకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇన్స్ట్రక్టర్ ,ఆయాలకు నియామక పత్రాలు అందజేత

## ప్రీ ప్రైమరీ విద్యా బలోపేతానికి ప్రభుత్వం ముందడుగు

**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలానికి 2026- 27 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని మూడు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రారంభించిన పాఠశాలలకు నియమితులైన ఇన్స్ట్రక్టర్ ,ఆయాలకు సోమవారం నియామక పత్రాలు అందించారు.జాన్ పహాడ్ ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఎంపిక కాబడిన ఇన్స్ట్రక్టర్ చలవాది అరుణ,ఆయా కోడబోయిన భవాని లకు గ్రామ సర్పంచ్ కేలావత్ కవిత, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యా బలోపేతానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు, మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిలాల్, మహిళా కాంగ్రెస్ జ్యోతి, ఎస్ కే బాల సైదా, శ్రీకాంత్, శేషు, ఉపాధ్యాయులు, గ్రామ పార్టీ కార్యకర్తలు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారులి



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# శంషాబాద్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## అధికారులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదేశాలు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండల కేంద్రంలోని మండల కార్యాలయంలో సోమవారం అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే, మండల వ్యాప్తంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ దిశానిర్దేశం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలను గుర్తించి, ఆయా శాఖలు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ ప్రగతి సమీక్షా సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో మండల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, వాటి అమలుకు కార్యాచరణ రూపొందించారు.




## డా. ఏ.పి.జే.అబ్దుల్ కలాంకు ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట్ మండల పరిధి హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన భారత రత్న, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు కలాం విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, భారత యువతకు కలలు కనడం నేర్పిన దార్శనికుడు డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం అని కొనియాడారు. భారతదేశాన్ని విజ్ఞాన శక్తితో ప్రపంచ వేదికపై నిలబెట్టిన మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఆయన కోట్లాది భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. పెద్ద కలలు కండి... ఆ కలలను నిజం చేసేందుకు నిరంతరం కృషి చేయండి అనే డా. కలాం సందేశం నేటికీ ప్రతి యువకుడికి స్ఫూర్తినిస్తోందని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ 123వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాంకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం దేశభక్తి, సేవా భావాన్ని ప్రతిబింబించేలా సాగింది.

## అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

### బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.నవీన్‌కుమార్ ముదిరాజ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేటి యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోని వారు చూపిన అడుగుజాడల్లో నడవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.నవీన్‌కుమార్ ముదిరాజ్ అన్నారు. సోమవారం కిస్మత్‌పూర్‌లో ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.నవీన్‌కుమార్ ముదిరాజ్ హాజరై అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.సామూల్, ఏ.రాములుయాదవ్, వెంకటేష్, పెంటయ్య, చంద్రశేఖర్, గౌస్‌బేగ్, రాజ్‌కుమార్, రాజేష్, టార్జన్ తదితరులు పాల్గొన్నారు.

## దూదేకుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బడే సాహెబ్ ను సన్మానించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర నూర్ భాషా దూదేకుల ముస్లిం జేఏసీ రాష్ట్ర చైర్మన్ గా ఇటీవల నియమితులైన షేక్ బడే సాహెబ్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని ఖమ్మం క్యాంప్ కార్యాలయం లో కలిసి ఆశీస్సులు తీసుకోన్నారు. సోమ వారం నాడు తెలంగాణ రాష్ట్ర నూర్ బాషా దూదేకుల బీసీ ముస్లిం రాష్ట్ర జేఏసీ చైర్మన్ అయిన సందర్భంగా వారి నుండి ఆశీస్సులు తీసుకున్నారు త్వరలో హైదరాబాదులో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులను కలిసి దూదేకుల కులస్తుల సమస్యలు పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని తెలిపారు.



# ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరులను పరిరక్షించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## 21 రైతు వేదికల్లో మూడు రోజుల పాటు విత్తన మేళా

## మధిర రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నీటి వనరులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. సోమవారం మధిర మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడటంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా క్రమంగా తగ్గుతున్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లివరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా జూలై 27 నుండి 29 వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 21 రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మండలానికి ఒక రైతు వేదిక చొప్పున ఈ మేళాలను నిర్వహిస్తున్నామని, రైతులు తమకు సమీపంలోని రైతు వేదికను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి**

వానాకాలం-2026 సీజన్‌కు ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 231.77 మెట్రిక్ టన్నులు (5,150 బస్తాలు), సహకార సంఘాల వద్ద 2,292.25 మెట్రిక్ టన్నులు (50,938 బస్తాలు), మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 3,153.96 మెట్రిక్ టన్నులు (70,088 బస్తాలు), సీఆర్‌పీ కమిషనర్ రిజర్వ్ పూల్‌లో 7,698.355 మెట్రిక్ టన్నులు (1,71,074 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991 మెట్రిక్ టన్నులు (22,022 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం 3,19,272 యూరియా బస్తాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 1,27,377 మంది రైతులు 3,90,762 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 3,52,172 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు అనవసర ఆందోళన చెందకుండా తమ సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల నుంచి అవసరమైన యూరియాను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహా రావు, సిపిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శంకర్‌పల్లిలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల కీలక సమావేశం

మడపతి చంద్రమౌళి

శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు

బొల్లారం వెంకట్ రెడ్డి

శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు





**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఎస్ఐఆర్ ప్రక్రియపై నేడు కాంగ్రెస్ బూత్ ఏజెంట్ల సమీక్ష సమావేశం బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి వివరాలతో హాజరుకావాలి: కాంగ్రెస్ పిలుపు నేడు సాయంత్రం 4 గంటలకు మనీ గార్డెన్‌లో కాంగ్రెస్ బూత్ ఏజెంట్ల సమావేశం ఎస్ఐఆర్ సమాచారంతో బూత్ ఏజెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలి:

## లారీని ఢీకొన్న బస్సు: ప్రయాణికులకు తప్పిన ముప్పు

జోగులాంబ గద్వాల: జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలోని ఘర్ దాబా వద్ద ఓ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన బస్సును ఇంటర్‌సిటీ స్మార్ట్ బస్సుగా గుర్తించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ.. బస్సులో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## విద్యార్థిని ఆత్మహత్యపై దర్యాప్తు

పోలవరం: ఇర్లపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముద్రం శివానీ ఆత్మహత్య ఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలికి ఏపీఎఫ్ఎస్ఎల్ క్లూస్ టీమ్‌లు చేరుకుని ఆధారాలను సేకరించాయి. దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారని, ఆ సూసైడ్ నోట్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు సీఐ వెల్లడించారు. నివేదిక వచ్చిన తర్వాత కేసులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. కాగా, కాగా, విద్యార్థిని శివాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

# ప్రభుత్వ ఉద్యోగి మైనర్ బాలికపై అత్యాచారం..


## కేసు నమోదు శాఖాపరమైన చర్యలు ఎక్కడ?

## ఏండ్లు గడుస్తున్నా చర్యలు శూన్యం..

## మునుగోడు నియోజకవర్గంలోనే విధుల నిర్వహణ..!

## పారదర్శకతపై ప్రశ్నలు.. జవాబుదారీతనం ఎక్కడ?

**నల్లగొండ నిఘా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులపై తీవ్రమైన ఆరోపణలు, క్రిమినల్ కేసులు నమోదైన సందర్భాల్లో, చట్టపరమైన ప్రక్రియతో పాటు శాఖా పరమైన విచారణ కూడా, సమాంతరంగా కొనసాగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే నల్లగొండ జిల్లా పరిధిలో నమోదైన ఓ కేసు విషయంలో మాత్రం, ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నిపుణుల సమాచారం ప్రకారం, మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలతో ఓ పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ శాఖకు చెందిన ఓ సెక్రటరీపై కేసు నమోదైంది. కేసు న్యాయస్థాన పరిధిలో విచారణలో ఉన్నప్పటికీ, సంబంధిత ఉద్యోగి ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గం పరిధిలోని, ఓ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజలకు సేవలందించాల్సిన బాధ్యత కలిగిన ఉద్యోగిపై ఇంత తీవ్రమైన ఆరోపణల కేసు నమోదై ఉండగా, శాఖాపరంగా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదైనప్పుడు, చట్టం అనుమతించే మేరకు వాస్తవాలను పరిశీలించి, అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం సంబంధిత అధికారుల బాధ్యతని ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో, ప్రజల




విశ్వాసాన్ని కాపాడేలా పారదర్శకంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. కోర్టులో కేసు విచారణ కొనసాగడం ఒక అంశమైతే, శాఖాపరమైన విచారణ మరో అంశమని పరిపాలనా వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అవసరమైతే నిబంధనల ప్రకారం వాస్తవాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో, ప్రజల్లో అనేక సందేహాలు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు కేసు వివరాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన శాఖాపరమైన చర్యలపై నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలంటే ఇలాంటి వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి అని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు, సంబంధిత ఆధారాలు, అధికారిక పత్రాలతో మరో ప్రత్యేక కథనంలో...

**"నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది."**

# రియల్టర్లకు రెడ్ కార్పెట్.. ప్రభుత్వ భూములకు రక్షణ ఎక్కడ?

## రెవెన్యూ చట్టాలకు తూట్లు పొడుస్తున్న భూ వ్యాపారులపై చర్యలు శూన్యం.

## గ్రామ ప్రజల హక్కులు హరించే ప్రయత్నాలపై ఆగ్రహం.

## అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల విక్రయాలపై సమగ్ర విచారణకు డిమాండ్

## బాట వారికోసమేనా తయారు చేసింది.. లేదా చేసాక వాడుకుంటున్నారా.!!



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయి. గ్రామ ప్రజల అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను, కొందరు రియల్టర్లు లక్ష్యంగా చేసుకుని అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల విక్రయాలకు తెరలేపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములకు హద్దురాళ్లు ఏర్పాటు చేసి, భూ రికార్డులు డిజిటలైజేషన్ చేసినప్పటికీ, కొందరు అక్రమార్కులు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా, తమ ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ ఆస్తుల్లా మారిపోతుండగా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోంది. ఇటీవల మర్రిగూడ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్‌లు, భారీ గేట్లు ఏర్పాటు చేసి ప్రైవేట్ వెంచర్లుగా ప్రచారం చేస్తూ, ప్లాట్ల విక్రయాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం కనిపించడం లేదని అంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, ముక్కు మూసుకొని ఉన్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమి అంటే ప్రజల ఆస్తి, అలాంటి భూములు ఆక్రమణలకు గురైతే భవిష్యత్ తరాల, అవసరాలు దెబ్బతింటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక బృందాన్ని నియమించి, మర్రిగూడ మండలంలో ప్రభుత్వ భూములపై జరిగిన ప్రతి లావాదేవీని సమగ్రంగా పరిశీలించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడటం అధికారుల రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ప్రజా ఆస్తులపై ఎలాంటి అక్రమానికీ తావులేకుండా పారదర్శక విచారణ జరిపి నిజాలను వెలుగులోకి, తీసుకురావాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల పరిధిలో తమ్మడపల్లిలో వెలుస్తున్న వెంచర్ చర్చ ముగియక ముందే, పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయం పరిధిలో వెలుస్తున్న ఓ పెద్ద మనిషి టాపిక్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతుంది.. ఈ వెంచర్ అక్రమాలపై గతంలో, కమ్యూనిస్ట్ లు కధం తొక్కారు.. అప్పటి అధికారులు వెంటనే చర్యలు తీసుకొని విక్రయాలను ఆపేసారు. పేదలకు దక్కాల్సిన ప్రభుత్వ ప్లాట్లలో, స్కూల్ కి బాట పేరుతో అక్రమంగా రోడ్డు నిర్మాణం చేసుకొని, నేడు ప్లాట్ల పేరుతో కోట్లకు పడగెత్తుతున్నారు నాయకులు. కస్తూరిభా పాఠశాలకు తీసిన బాటనే టార్గెట్ చేసుకొని, ఓ పెద్ద మనిషి ఏకంగా వెంచర్ నే తెర మీదికి తెచ్చారు.!? నిజానికి ఈ రోడ్డు నిర్మాణం పాఠశాల విద్యార్థులకు, అయినప్పటికీ ఇప్పుడు రియల్టర్లకు వరంగా మారిందా!!లేక రియల్టర్ల కోసమే బాట వేసారా అనేది అర్థం కాని పరిస్థితి..అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పూర్తి ఆధారాలతో వరుస కథనాల ద్వారా మీ ముందుకు.

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది.**



# నేరేడుచర్ల పట్టణంలో సర్ ప్రక్రియపై సమీక్ష

## సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి

## భాజపా పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** 'సర్' ప్రక్రియలో భాగంగా ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా బీజేపీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని భాజపా పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి సూచించారు పట్టణ కమిటీ నేరేడుచర్ల మున్సిపాలిటీలోని వివిధ బూత్ ల బీయల్వో లను కలిసి సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఓటరు ధ్రువీకరణ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ , కొత్త ఓటర్ల నమోదు, తొలగింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకోవడంతో పాటు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, ప్రతి అర్హులైన ఓటరికి అవకాశం కల్పించేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని బిఎల్ఓ లకు సూచించడం జరిగింది.

అలాగే కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు,సౌకర్యాలు సరిగా లేక ఓటర్లకు దూరంగా ఉన్న దగ్గర పోలింగ్ స్టేషన్ల మార్పుల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కౌన్సిల్ మెంబర్ కుందూరు కోటిరెడ్డి, సర్ నియోజకవర్గ ఇన్చార్జి తాళ్ల నరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ఉరిమల్ల రామ్మూర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు జూలూరి అశోక్, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొప్పు లక్ష్మీనారాయణ, దేవిరెడ్డి నాగిరెడ్డి, బుస్సా విమల, చేపూరి కృష్ణవేణి, బూత్ బి.ఎల్.ఒ లు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

## బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి

## విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ: కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

## విమానాశ్రయ ప్రారంభోత్సవంపై సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి: భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఈడీల కమిటీ అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలి

## ఆర్టీసీ ఖమ్మం డిపో వద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

### 2019 సమ్మె కేసులు ఎత్తివేయండి,ఉద్యోగ భద్రత కమిటీని వెంటనే నియమించండి

### సమస్యలు పరిష్కరించండి,పని భారం తగ్గించండి

### రాష్ట్ర నేతలు గడ్డం లింగమూర్తి,పిట్టల సుధాకర్ డిమాండ్







**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ల కమిటీ అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని, పెంచిన అలవెన్సు లను అమలు చేయాలని పని భారం తగ్గించాలని ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి పిట్టల సుధాకర్ లు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపో వద్ద ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించి అంశాలను వెంటనే అమలు చేయాలని పనిభారం తగ్గించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మిక ఐక్యత వర్ధిల్లాలని కార్మికులు నినదించారు. ధర్నా ను ఉద్దేశించి లింగమూర్తి, సుధాకర్ లు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలు చేయకపోవడం వలన కేవలం అలవెన్సుల రూపంలోనే రాష్ట్ర వ్యాప్తంగా నెలకు సుమారు మూడు కోట్ల రూపాయలు కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల సత్వరమే యాజమాన్యం అంగీకరించిన అంశాల అమలుకు సర్క్యులర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీతో జరిగిన చర్చల ప్రొసీడింగ్స్ కాపీని వెంటనే కార్మిక సంఘాలకు అందించాలని 2026 మే 21న జరిగిన చర్చలలో అంగీకరించినట్లు 80% పెంచిన అలవెన్సులను జులై నెల జీతం నుండి అమలు జరిగేలా చూడాలని బ్రెడ్ విన్నర్ స్కీంలో పర్మినెంటు విధానంలో రిక్రూట్ చేస్తామని ఇప్పుడు పని చేస్తున్న వారినందరిని రెగ్యులర్ చేస్తామని అంగీకరించిన దానిని అమలు చేయాలని ఆర్టీసి యాజమాన్యం నిర్వహించిన పరీక్షలో పాసైన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికులను జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని ఉద్యోగ భద్రత కమిటీని వెంటనే నియమించాలని ఉద్యోగ భద్రతపై అన్ని యూనియన్ల అభిప్రాయాలను తీసుకొని ప్రపోజల్స్ ను తయారు చేసి కార్మిక సంఘాలకు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) హయ్యర్ పెన్షన్ అమలులో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని. ఈ సమస్యపై కో-ఆర్డినేటర్స్ ను పెడతామన్న దానిని అమలు చేయాలని. 2019 సమ్మెలో పెట్టిన పోలీసు కేసులు ఎత్తివేయాలని. పని పరిస్థితుల మెరుగుదల కోసం డిపో స్థాయిలోను, రీజియన్ స్థాయిలోను కార్మిక సంఘాలతో చర్చించి, పని భారాలు తగ్గించే చర్యలు తీసుకుంటామని అంగీకరించిన దానిని వెంటనే అమలు చేయాలని మహిళా కార్మికుల ప్రత్యేక సమస్యలు పరిష్కరించాలని ప్రమోషన్స్ అన్ని రీజియన్లలో సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమల్లో భాగంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం సంతోషకరమని వెంటనే కార్మికులతో చేసిన చర్చలు అంగీకరించి అంశాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు చాలా కాలం నుండి ఇబ్బందుల్లో ఉన్నారని అందువల్ల సమస్యలు పరిష్కరించడం ద్వారా ఆర్టీసీలో ప్రశాంతత నెలకొల్పాలని ఆయన కోరారు. డిపో మేనేజర్ కు విజ్ఞాపన పత్రం అందజేత డిపో వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ప్రచార కార్యదర్శి తోకల బాబు, రీజియన్ మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ డి.సరిత, డిపో కమిటీ ఉపాధ్యక్షులు జి.బాబు, ప్రచార కార్యదర్శి చెరుకూరి రామకృష్ణ (ఆర్కే నాయుడు) నాయకులు కత్తి కాంతారావు, యాదగిరి రావు, కోటి, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు చేసిన వేలాది దొంగఓట్లను తొలగించాలి:కె ఎల్ ఆర్

**ప్రతీ ఇంటికీ ఎన్యూమరేషన్ ఫామ్స్ అందేలా చూడాలి...!**

**అప్ లోడ్ చేసేలా బి ఎల్ ఓ లతో బి ఎల్ ఎ లు సమన్వయం చేసుకోవాలి....**

**ఎస్ ఆర్ ఐ ప్రక్రియపై కాంగ్రెస్ ముఖ్య నేతలతో కిచ్చెన్న వీడియో కాన్ఫరేన్స్**

**ఆగస్టు 3వరకు అప్రమత్తంగా పని చేయాలి టి పి సి సి ఇన్చార్జి జగదీష్**





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోటాపోటీగా బీజేపీ/ బి ఆర్ ఎస్ పార్టీలు వేలాది దొంగఓట్లను నమోదు చేశాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ శ్రేణులు, సూపర్ వైజర్స్, బూత్ ఇన్చార్జులు, అధ్యక్షులు, కో-ఆర్డినేటర్స్, అబ్జర్వర్స్ తో కె ఎల్ ఆర్, టి పి సి సి ఇన్చార్జి జగదీష్ కుమార్. వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లాడుతూ... ప్రతీ ఎన్యూమరేషన్ ఫామ్స్ ను బి ఎల్ ఓ లు అప్ లోడ్ చేసేలా బి ఎల్ ఏ లు కృషి చేయాలని కోరారు. చనిపోయిన వారు, దొంగఓట్లను తొలగించాలి. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, మార్పు-చేర్పులను నిషితంగా గమనించాలని చెప్పారు. టి పి సి సి ఇన్చార్జి జగదీష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ... ఆగస్టు 3 వరకు ప్రతీ ఓటును జల్లెడ పట్టాలని కోరారు. తటస్థ ఓటర్లు, షిఫ్ట్ అవుతున్న కాంగ్రెస్ ఓటర్లు, కొత్త ఓటర్ల నమోదును మ్యాపింగ్ చేయాలని సూచించారు. నేడు (28న) మంత్రి శ్రీధర్ బాబు తో వి సి లక్ష్మారెడ్డిఎస్ ఆర్ ఐ ఎన్యూమరేషన్ ఫారమ్స్ ఇంటింటికి చేరవేయటం, బి ఎల్ ఓ లు, ఇన్చార్జులు, అబ్జర్వర్లు, సూపర్ వైజర్స్, అధ్యక్షుల పనితీరుపై రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని కిచ్చెన్నగారు తెలిపారు. ఉదయం 10గంటలకు: ఆర్ కే పురం ఎన్ ఆర్ , నగర్, సరూర్ నగర్, డాక్టర్స్ కాలనీ, బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్, మీర్పేట్, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ డివిజన్లతో వీడియో కాన్ఫరెన్స్ ఉదయం 11 గంటలకు: మహేశ్వరం,కందుకూరు మండలాలు, జల్ పల్లి, షాహిన్ నగర్, పహాడీషరీఫ్, తుక్కుగూడ, మంకాల్ డివిజన్లతో కాంగ్రెస్ నేతల వీడియో కాన్ఫరెన్స్. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు , కి ఎల్ ఆర్ ,టి పి సి సి ఇన్చార్జి జగదీష్ కుమార్ సహా కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి సహా ముఖ్య నాయకులు పాల్గొంటారు.

# ఎల్‌నినోను దృష్టిలో పెట్టుకుని సాగు చేయాలి

**రైతు వేదికల్లో అందుబాటులో నాణ్యమైన విత్తనాలు**

**రైతులకు సూచించిన వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి**



హైదరాబాద్: ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ సూచించారు. ముఖ్యంగా పాడి రైతులు పశుగ్రాస అవసరాల కోసం మేత జొన్న సాగు చేపట్టాలని తెలిపారు. అలాగే నగరానికి సమీప ప్రాంతాల్లోని రైతులు కూరగాయల సాగు చేపట్టడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులు, పంటల సాగు, వర్షాభావ పరిస్థితులపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతు వేదికల్లో కందులు, పెసలు, మినుములు, కూరగాయల విత్తనాలు, మేత జొన్న విత్తనాలు తదితర నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ విత్తన మేళ 29 వరకు రైతులకు అందుబాటులో ఉంటుంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం వెల్జర్ల గ్రామంలోని వ్యవసాయ పొలాలను సందర్శించిన వ్యవసాయ శాఖ కార్యదర్శి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థిపై వేధింపులే ఆత్మహత్యాయత్నానికి దారితీశాయా?

**ముగ్గురు ఉపాధ్యాయుల వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు... నిజానిజాలు తేల్చాలని డిమాండ్!!**

**పాఠశాల వాతావరణంపై ప్రశ్నలు... విద్యాశాఖ, పోలీసుల సమగ్ర విచారణకు స్థానికుల విజ్ఞప్తి.**

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని, ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. విద్యార్థి ఈ నిర్ణయానికి దారితీసిన పరిస్థితులపై పలు ఆరోపణలు వినిపిస్తుండగా, వాస్తవాలు వెలుగులోకి రావాలంటే, సమగ్ర దర్యాప్తు అవసరమని స్థానికులు కోరుతున్నారు. ఈ విద్యార్థిని కొందరు ఉపాధ్యాయులు తరచూ మందలించడం, తోటి విద్యార్థుల ఎదుట అవమానించడం, మానసిక ఒత్తిడికి గురిచేసేలా ప్రవర్తించారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే విద్యార్థి తీవ్ర మనోవేదనకు గురై, ఇంటికి వెళ్లిన అనంతరం పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.! ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన విద్యాలయాల్లో, ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమని వారు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల సమస్యలను సానుభూతితో పరిష్కరించాల్సిన ఉపాధ్యాయులపై, ఇలాంటి ఆరోపణలు రావడం విద్యా వ్యవస్థకే మచ్చగా మారుతుందని అంటున్నారు.? అయితే ఈ ఆరోపణలు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు, ఘటనకు సంబంధించి విద్యాశాఖ అధికారులు, పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి, విద్యార్థి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థుల వాంగ్మూలాలు నమోదు చేసి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.? ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యం, తప్పిదం ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో వాస్తవాలు నిర్ధారణ కాకముందే ఎవరిపైనా నిర్ణయాత్మకంగా అభియోగాలు మోపకుండా, నిష్పాక్షిక విచారణ జరగాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ఈ ఘటనపై విస్తృత చర్చ కొనసాగుతుండగా, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల ప్రవర్తనా విధానంపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా, ఆత్మీయ వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




# మహేశ్వరం పారిశ్రామిక పార్క్‌ను సందర్శించిన సిఎస్

**అక్కడ పరిశ్రమల ఉత్పత్తులను పరిశీలించిన అధికారులు**

హైదరాబాద్: ఈ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో పలు పరిశ్రమలను సి.ఎస్ సంజయ జాజు సందర్శించారు. సి.ఎస్ తో పాటు టి.జి.ఐ.ఐ.సి. స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతో పాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ముందుగా,మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతరం అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈ-సిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్ మరియు రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా, తమకు . కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్‌ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది.

# టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ కీలక నిర్ణయం..

## అమెరికాలో భారీగా ఉద్యోగాల కోత




ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ (ఘుఎంబఅస్త్ర జుశ్రీవవ్తీశీఅఱఎం) అమెరికా (ఖుూూ) లో తన కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. న్యూజెర్సీ (చీవష జీవతీంవఎ) లోని తన శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా (ఎస్‌ఈఏ) ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు తరలించడంతో పాటు, పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను ప్రకటించింది. ఈ మార్పుల వల్ల వందలాది మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ప్రధాన కార్యాలయాన్ని న్యూజెర్సీలోని ఎంగిల్‌వుడ్ క్లిఫ్స్ నుంచి టెక్సాస్‌లోని ప్లానోకు తరలించే ప్రక్రియలో భాగంగా 739 ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని శాంసంగ్ ధృవీకరించింది. వీరిలో ఎక్కువ మందికి టెక్సాస్‌కు మారేందుకు అవకాశం కల్పించగా.. ఆసక్తి చూపని వారిని విధుల నుంచి తొలగించారు. దీనికి అదనంగా టెక్సాస్‌లోని ప్లానో కార్యాలయంలో మొబైల్ విభాగంతో సహా సుమారు 100 మంది ఉద్యోగులను కూడా తొలగించినట్లు కంపెనీ అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైంది. జూన్ 30న సంస్థ వ్యాప్తంగా ఉద్యోగాల కోత ఉంటుందని ఉద్యోగులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా 30 మందికి పైగా సీనియర్ సేల్స్, మార్కెటింగ్ సిబ్బంది తాము కంపెనీని వీడుతున్నట్లు లింక్డ్‌ఇన్‌లో పోస్టులు పెట్టారు. ఈ మార్పులపై శాంసంగ్ స్పందిస్తూ.. 'వివిధ బృందాలను ఒకేచోటికి తీసుకురావడం ద్వారా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు, మెరుగైన సహకార వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఏఐ ఎకోసిస్టమ్‌లో భాగం కావాలనే లక్ష్యంతోనే టెక్సాస్‌కు మారుతున్నాం' అని వివరించింది. ఇది ప్రపంచవ్యాప్త పునర్‌వ్యవస్థీకరణ కాదని, కేవలం అమెరికాలోని కార్యకలాపాలను ప్రస్తుత వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా మార్చడమేనని స్పష్టం చేసింది.

## ఎయిర్‌టెల్ సైలెంట్ షాక్! పాపులర్ ప్లాన్ తొలగింపు




దేశీయ టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ తన పోస్ట్‌పెయిడ్ పోర్ట్‌ఫోలియోలో కీలక మార్పు చేసింది. వ్యక్తిగత వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న రూ.549 పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌ను సైలెంట్‌గా తొలగించింది. ప్రస్తుతం ఈ ప్లాన్ ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో కూడా కనిపించడం లేదు. అయితే ఈ మార్పుపై కంపెనీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఈ నిర్ణయంతో ఇప్పుడు కొత్త పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు రూ.449 వ్యక్తిగత ప్లాన్ ఎంట్రీ-లెవల్ ఎంపికగా మిగిలింది. మరోవైపు, రూ.549 కంటే ఎక్కువ ప్రయోజనాలు కోరుకునే కస్టమర్లు నేరుగా రూ.699 ఫ్యామిలీ ప్లాన్‌ను ఎంచుకోవాల్సి వస్తుంది. దీంతో ఎయిర్‌టెల్ తన అధిక ధరల ఫ్యామిలీ ప్లాన్‌ల వైపు వినియోగదారులను మళ్లించే ప్రయత్నం చేస్తోందని టెలికాం రంగ నిపుణులు భావిస్తున్నారు.

**రూ.449 ప్లాన్‌లో ఏమున్నాయి?**

రూ.449 వ్యక్తిగత పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లో అపరిమిత 4+/5+ డేటా, అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్‌టీడీ, నేషనల్ రోమింగ్ కాల్స్, రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లు లభిస్తాయి. అదనంగా 3 నెలల ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం, 6 నెలల పాటు 100 +దీ గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజ్, ఏడాది పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం, ఉచిత హాలో ట్యూన్స్, బ్లూ రిబ్బన్ బ్యాగ్ ట్రాకింగ్, అలాగే 5+ ఫాస్ట్ లేన్, స్పామ్ కాల్ అలర్ట్స్, ఫ్రాడ్ లింక్ బ్లాకింగ్, న్యూ అలర్టుల వంటి భద్రతా ఫీచర్లు కూడా అందుబాటులో ఉంటాయి.

**రూ.699 ఫ్యామిలీ ప్లాన్‌లో అదనపు ప్రయోజనాలు**

రూ.699 ఫ్యామిలీ ప్లాన్‌లో ఒక మెయిన్ కనెక్షన్‌తో పాటు ఒక ఉచిత యాడ్-ఆన్ సిమ్ లభిస్తుంది. అంటే ఇద్దరు సభ్యులు ఈ ప్లాన్‌ను వినియోగించుకోవచ్చు. ప్రతి కనెక్షన్‌కు సగటున సుమారు రూ.350 ఖర్చు మాత్రమే అవుతుంది. ఇందులో కూడా అపరిమిత 4+/5+ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లు లభిస్తాయి. అదనంగా 6 నెలల అమెజాన్ ప్రైమ్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, 12 నెలల జియో హాట్ స్టార్ మొబైల్, 6 నెలల గూగుల్ వన్ (100+దీ), 3 నెలల ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం, ఏడాది పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం వంటి ఓటీటీ ప్రయోజనాలు కూడా ఇందులో ఉన్నాయి.

## బ్యాంక్ ఆఫ్ బరోడాలో డేటా చోరీ

**హ్యాకింగ్ గ్రూప్ ట్రిపుల్‌ఎక్స్ చేతికి 1 టీబీ సమాచారం**

**దాదాపు 3 లక్షల మంది కస్టమర్ల వివరాలు డార్క్‌వెబ్‌లో లీక్**

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లో భారీ హ్యాకింగ్ చోటు చేసుకుంది. ఏకంగా 1 టీబీ (1000 జీబీ) డేటా లీకయ్యింది. ఇందులో కస్టమర్ల సమాచారంతో పాటు బ్యాంకు అంతర్గత వివరాలు కూడా ఉన్నాయి. సైబర్ చోరీకి పాల్పడింది తామేనని ప్రకటించుకున్న ట్రిపుల్‌ఎక్స్ అనే హ్యాకింగ్ గ్రూప్.. ఈ డేటాను డార్క్ వెబ్‌లో ఉచితంగా పోస్ట్ చేసింది. డార్క్ వెబ్ ప్లాట్‌ఫాం ర్యాన్‌సమ్‌వేర్. లైవ్‌లో జూలై 24న పెట్టిన పోస్ట్ ప్రకారం ట్రిపుల్‌ఎక్స్ తస్కరించిన డేటాలో 1,00,000 నుంచి 3,00,000 వరకు కస్టమర్ అప్లికేషన్ ఫారంలు ఉన్నాయి. ఖాతా తెరిచేటప్పుడు కస్టమర్లు ఇచ్చిన ఫొటోలు, ఐడెంటిటీ డాక్యుమెంట్లు, సేవింగ్స్..కరెంటు ఖాతాల సమాచారం, రుణ దరఖాస్తు రికార్డులు, నెట్‌బ్యాంకింగ్ యూజర్ వివరాలు, ఎన్నారై, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన సమాచారం ఉంది. ఆడిట్ రిపోర్టులు, రుణాల మదింపు పత్రాలు, విజిలెన్స్ ఇన్వెస్టిగేషన్ రికార్డులు, బీవోబీ వరల్డ్ ఆడిట్ రిపోర్టుల్లాంటి బ్యాంకు అంతర్గత వివరాలు కూడా ఇందులో ఉన్నట్లు నిపుణులు వెల్లడించారు. దీన్నొక 'సైబర్ విపత్తు'గా వారు . ఆర్థిక సంస్థల డేటాను ట్రిపుల్‌ఎక్స్ దొంగిలించడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మే నెలలోనే ఇండోనేసియాకి చెందిన ప్రభుత్వ రంగ బ్యాంక్ నెగారా ఇండోనేసియా నుంచి 2 టీబీ డేటాను చోరీ చేసింది. ఒక ఉద్యోగి ఈమెయిల్‌ని ఉపయోగించుకుని హ్యాకర్లు అనధికారికంగా డేటాను దక్కించుకున్నట్లు మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో బీవోబీ వెల్లడించింది. దీన్ని సత్వరం గుర్తించి, నష్టనివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. దీనిపై సమగ్ర ఫోరెన్సిక్ విచారణ చేపట్టినట్లు వివరించింది. అయితే, లీక్ ఎప్పుడు జరిగింది, ఏయే వివరాలు చోరీకి గురయ్యాయి, సదరు ఉద్యోగి హోదా మొదలైన విషయాలను వెల్లడించలేదు. తమ కోర్ బ్యాంకింగ్ సిస్టం సురక్షితంగానే ఉందని, అందులోకి హ్యాకర్లు చొరబడలేదని బ్యాంకు స్పష్టం చేసింది. కీలక డేటాను సురక్షితంగా ఉంచేందుకు పటిష్టమైన భద్రత ప్రమాణాలు పాటిస్తున్నామని వివరించింది.

## భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు.. టికెట్ ధర ఎంతంటే?





భారతదేశం ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుని.. వేగంగా ముందుకు దూసుకెళ్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండియాలో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించారు. ఈ రైలు పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో తయారవడం భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం. ఈ కథనంలో ఈ ట్రైన్ టికెట్ ధరలు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకుందాం. భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు హర్యానా రాష్ట్రంలోని జింద్ నుంచి సోనిపట్ వరకు నడుస్తుంది. మధ్యలో అనేక చిన్న స్టేషన్లలో ఆగుతూ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అయితే.. ఈ రైలులో ప్రయాణించడానికి అయ్యే ఖర్చు (టికెట్ ధర) కూడా చాలా తక్కువే కావడం గమనార్హం. రూ.5 నుంచి రూ.25 వరకు మాత్రమే టికెట్ చార్జీ ఉండటం వల్ల.. ప్రతి ఒక్కరూ ఈ రైలులో ప్రయాణించవచ్చు. దీన్నిబట్టి చూస్తే.. ఈ ట్రైన్ టికెట్ ప్రారంభ ధర.. సాధారణ ట్రైన్ ప్లాట్‌ఫామ్ టికెట్ రేటు (రూ.10) కంటే తక్కువ అని తెలుస్తోంది. ఈ రైలు సాధారణ డీజిల్ లేదా ఎలక్ట్రిక్ రైళ్ల మాదిరిగా కాకుండా.. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. అంటే ఈ ట్రైన్ ముందుకు వెళ్ళడానికి డీజిల్, ఎలక్ట్రిక్ (కరెంట్) అవసరం లేదు. హైడ్రోజన్ ఆక్సిజన్‌తో చర్య జరిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. తద్వారా ట్రైన్ ముందుకు వెళ్తుందన్నమాట. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే బయటకు వస్తుంది. తద్వారా గాలి కాలుష్యం తగ్గుతుంది. ఈ రైలులో మొత్తం పది కోచ్‌లు ఉంటాయి. ఒకేసారి సుమారు 2,600 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చు. ప్రయాణికుల భద్రత కోసం హైడ్రోజన్ లీకేజీ, పొగ, మంటలు, అధిక ఉష్ణోగ్రతలను గుర్తించే ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా ఇందులో ఏర్పాటు చేశారు. హైడ్రోజన్ రైలు ప్రారంభం కావడంతో.. భారత్ జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన నిలిచింది. ఇది భారతదేశానికి గర్వకారణమైన విషయం. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని పర్యావరణహిత రైళ్లు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తే కాలుష్యం తగ్గడమే కాకుండా ఇంధన వ్యయం కూడా తగ్గుతుంది. ఈ దిశగా ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకుంటోంది.




## పిల్లల కోసం టెస్లా బైక్.. రూ.20 వేలు మాత్రమే!

ఎలక్ట్రిక్ కార్ల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న టెస్లా ఇప్పుడు పిల్లల కోసం ఒక ప్రత్యేకమైన బ్యాలెన్స్ బైక్‌ను లాంచ్ చేసింది. ఈ విషయాన్ని కంపెనీ అధికారికంగా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. నిజానికి టెస్లా కంపెనీ.. పెద్దవాళ్లకు ఎలక్ట్రిక్ బైక్ లాంచ్ చేస్తుందని చాలామంది ఎదురుచూశారు. కానీ సంస్థ మాత్రం చిన్నారులను దృష్టిలో ఉంచుకుని ఈవీ సైకిల్ విడుదల చేసింది. ఈ బ్యాలెన్స్ బైక్‌ను 2 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల కోసం రూపొందించారు. టెస్లా బ్యాలెన్స్ బైక్‌లో పెడల్స్, చైన్ లేదా ఎలక్ట్రిక్ మోటార్ వంటివి ఉండవు. కేవలం పిల్లలు తమ కాళ్లతో బైక్‌ను ముందుకు కదిలిస్తూ బ్యాలెన్స్, హ్యాండిల్ తిప్పడం నేర్చుకునేలా తయారు చేశారు. ఇది ఒక ప్రత్యేకమైన డిజైన్ పొందుతుంది. ఇందులో మెగ్నీషియం అల్లాయ్ ఫ్రేమ్ ఉపయోగించడం వల్ల పిల్లలు సులభంగా నడపగలరు. బైక్‌పై టెస్లా లోగో, ముందు భాగంలో కంపెనీ గుర్తు కూడా ఉన్నాయి. ఈ బైక్ ధర 225 డాలర్లు (సుమారు రూ.20 వేలు). సాధారణ పిల్లల బ్యాలెన్స్ బైక్‌లతో పోలిస్తే దీని ధర కొంత ఎక్కువే. అయితే ప్రీమియం బ్రాండ్ల బైక్‌లతో పోలిస్తే.. టెస్లా ధర కూడా అదే స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బైక్ సీటు ఎత్తును పిల్లల పెరుగుదలకు అనుగుణంగా ఐదు రకాలుగా మార్చుకునే సౌకర్యం ఉంది. గరిష్టంగా 35 కిలోల బరువు ఉన్న పిల్లలు దీనిని ఉపయోగించవచ్చు. బైక్‌ను అసెంబుల్ చేసుకోవడానికి అవసరమైన టూల్స్ కూడా ప్యాకేజీలో అందిస్తారు.

## ఐపీవో బాటలో మేక్ మై ట్రిప్ ఇండియా





ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫాం మేక్‌మైట్రిప్ ఇండియా (ఎంఎంటీ ఇండియా) పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉంది. ఇందుకు సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రాతిపదికన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. దీని ప్రకారం.. కంపెనీ మాతృ సంస్థ మేక్‌మైట్రిప్, దాని అనుబంధ సంస్థ ఐబిబో గ్రూప్ హోల్డింగ్స్ కొంత వాటాలను విక్రయించనున్నాయి. తద్వారా వచ్చిన నిధులు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడనున్నాయి. ఐపీవో అనంతరం కూడా మేక్‌మైట్రిప్‌కి ఎంఎంటీ ఇండియా అనుబంధ సంస్థగానే కొనసాగుతుంది.

## పార్లమెంట్‌లో 'ఆదాయ పన్ను సవరణ బిల్లు-2026'




కేంద్ర ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలకమైన ఆర్థిక సంస్కరణను చట్టరూపంలోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఇటీవల జారీ చేసిన ఒక అత్యవసర ఆర్డినెన్స్ స్థానంలో.. 'ఆదాయ పన్ను (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టేందుకు ముసాయిదాను సిద్ధం చేసింది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సెషన్‌లో ఈ బిల్లుకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా గత నెల (జూన్ 5, 2026) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆదాయ పన్ను (సవరణ) ఆర్డినెన్స్, 2026'ను భర్తీ చేయనున్నారు. పార్లమెంట్ సమావేశాలు లేని సమయంలో తక్షణ నివారణ చర్యల కోసమై రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 ప్రకారం లభించిన ప్రత్యేక అధికారాల ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వులతో ఈ ఆర్డినెన్స్‌ను అమల్లోకి తెచ్చారు. ఇది ఏప్రిల్ 1, 2026 నుంచి పాత తేదీతో వర్తిస్తుంది. ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం.. భారత ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం. గరిష్ట భద్రత గల ప్రభుత్వ బాండ్ల ద్వారా విదేశీ ఇన్వెస్టర్లకు లభించే వడ్డీ ఆదాయం, వాటి విక్రయాల ద్వారా వచ్చే మూలధన లాభాలపై ఆదాయ పన్ను నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వడం ఈ కొత్త బిల్లులోని ప్రధానాంశం. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ముడిచమురు ధరల్లో విపరీతమైన హెచ్చుతగ్గులు, ప్రపంచ మార్కెట్ల ఒడిదొడుకుల నేపథ్యంలో భారత్ ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. దీని ద్వారా ఒరగూరే ప్రయోజనాలు.. భారత సార్వభౌమ రుణ మార్కెట్‌ను (సావరిన్ డెట్ మార్కెట్) అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతం చేయడం.




గుర్తింపు లేని కాలేజీ నిర్వహిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నానో కాలేజీ యాజమాన్యం

అనుమతులు లేని నానో కాలేజీ యాజమాన్యం...

రేపు విద్యార్థులతో ఎక్కడ పరీక్షలు రాయిస్తారు?

లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోన్న నానో కాలేజీ పై చర్యలకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఎందుకు వెనకాడుతున్నారు?!

కాలేజీ యాజమాన్యంతో లోపాయ కారి ఒప్పందం లేకపోతే నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్నా చర్యలేవీ??!



# నానో కాలేజీకి ఇంటర్ బోర్డుకు నిబంధనలు

# వర్తించవా?

బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో నాదర్గుల్ లోని నానో కాలేజీ యాజమాన్యానికి ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలు వర్తించవా? అంటూ విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎటువంటి గుర్తింపు లేకపోయినా, ఈ విద్యాసంస్థ పై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనకాడుతున్నారని నిలదీస్తున్నారు. గుర్తింపు లేని కాలేజీని నిర్వహిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న నానో కాలేజీ యాజమాన్యం, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని వారు మండిపడుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎటువంటి గుర్తింపు లేని నానో కాలేజీ యాజమాన్యం రేపు విద్యార్థుల చేత ఎలా పరీక్షలను రాయిస్తుందని

**(క్రైమ్ మిర్రర్ నిఘా ప్రతినిధి ):** ఏదో ఒక కాలేజీ పేరిట ప్రైవేటు విద్యార్థులుగా పరీక్షలను రాయించాలన్నదే నానో కాలేజీ యాజమాన్యం వ్యూహంగా కనిపిస్తోందని విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తిగా కష్టపడి చదువుకున్న విద్యార్థులను ప్రైవేటు విద్యార్థులుగా ఏదో ఒక ఇంటర్మీడియట్ కాలేజీ నుంచి పరీక్షలు రాసే దుస్థితికి తీసుకువచ్చింది ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారుల కాసుల కక్కుర్తేనని వారు విరుచుకుపడ్డారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నాదర్గుల్ లో నిర్వహిస్తున్న నానో కాలేజీ యాజమాన్యానికి ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు . విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఇప్పటికే నానో కాలేజీ అక్రమాలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు లెక్కకు మించినన్ని సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, బోర్డు అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతూ నానో కాలేజీకి కేవలం తాకీదులు పంపి తమ పని అయిపోయిందన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ నుంచి ఎటువంటి గుర్తింపు లేకుండానే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ, బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని నాదర్గుల్ కేంద్రంగా ది నానో జూనియర్ కాలేజ్ ను కొంతమంది వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కాలేజీ నిర్వాహకులు లక్షల రూపాయలు దండుకుంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ' ది నానో ' జూనియర్ కాలేజీ యాజమాన్యం చెలగాటమాడుతోందని తెలిసి కూడా,ఇంటర్మీడియట్ బోర్డ్ యంత్రాంగం మొద్దు నిద్ర వీడకపోవడం విడ్డూరంగా ఉంది. గుర్తింపు లేని ఇంటర్మీడియట్ కాలేజీ పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యా చట్టం చెబుతున్నప్పటికీ, అమలు చేయడానికి రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి, బోర్డు యంత్రాంగం వెనుకంజ వేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తెలంగాణ విద్యా చట్టం 1982 ప్రకారం గుర్తింపు లేకుండా ఇంటర్మీడియట్ కాలేజీలను నిర్వహించే యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించవచ్చు. అలాగే కాలేజీలను మూసి వేసే అధికారం జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారికి ఉన్నప్పటికీ, అలసత్వం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది ఇట్టే ఎవరికైనా అర్థమవుతోంది. కాలేజీ యాజమాన్యంతో ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు లాలూచీపడి వందలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టడం పట్ల విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. ది నానో కాలేజీ నిర్వహిస్తున్న బిల్డింగ్ కు ఎటువంటి మునిసిపల్ అనుమతులు లేకపోయినప్పటికీ, ఇప్పటివరకు బడంగ్పేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య కనీసం నోటీసులను కూడా జారీ చేయకపోవడం హాస్యాస్పదంగా ఉంది. మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ భవనాన్ని కూల్చివేసే అధికారం జిహెచ్ఎంసి అధికారులకు ఉన్నప్పటికీ, తమ అధికారాన్ని ఎందుకు ఉపయోగించడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇక అగ్నిమాపక శాఖ నుంచి ఎటువంటి నిరభ్యంతర పత్రం( ఎన్ ఓ సి )ని పొందకుండానే నిర్వహించే విద్య, వ్యాపార సంస్థల యాజమాన్యాలపై నాన్ బెయిలబుల్ కేసులను నమోదు చేసే అధికారం ఉంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుడు ప్రకటనలతో బురిడీ కొట్టించి, ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా గుర్తింపు లేకుండానే కాలేజీ నిర్వహిస్తున్న యాజమాన్యంపై పోలీసులు సైతం కేసు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ది నానో కాలేజీ యాజమాన్యం నిబంధనలన్నింటినీ ఉల్లంఘించి కాలేజీ నిర్వహిస్తున్నప్పటికీ, ఏ ఒక్క శాఖ కూడా స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 400 మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిన ది నానో కాలేజీ యాజమాన్యంపై తక్షణమే ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి స్పందించి సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమ భవనాన్ని నిర్మించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ను కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ది నానో కాలేజీ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.









# పిల్లల కోసం టెస్లా బైక్.. రూ.20 వేలు మాత్రమే!

ఎలక్ట్రిక్ కార్ల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న టెస్లా ఇప్పుడు పిల్లల కోసం ఒక ప్రత్యేకమైన బ్యాలెన్స్ బైక్‌ను లాంచ్ చేసింది. ఈ విషయాన్ని కంపెనీ అధికారికంగా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. నిజానికి టెస్లా కంపెనీ.. పెద్దవాళ్లకు ఎలక్ట్రిక్ బైక్ లాంచ్ చేస్తుందని చాలామంది ఎదురుచూశారు. కానీ సంస్థ మాత్రం చిన్నారులను దృష్టిలో ఉంచుకుని ఈవీ సైకిల్ విడుదల చేసింది. ఈ బ్యాలెన్స్ బైక్‌ను 2 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల కోసం రూపొందించారు. టెస్లా బ్యాలెన్స్ బైక్‌లో పెడల్స్, చైన్ లేదా ఎలక్ట్రిక్ మోటార్ వంటివి ఉండవు. కేవలం పిల్లలు తమ కాళ్లతో బైక్‌ను ముందుకు కదిలిస్తూ బ్యాలెన్స్, హ్యాండిల్ తిప్పడం నేర్చుకునేలా తయారు చేశారు. ఇది ఒక ప్రత్యేకమైన డిజైన్ పొందుతుంది. ఇందులో మెగ్నీషియం అల్లాయ్ ఫ్రేమ్ ఉపయోగించడం వల్ల పిల్లలు సులభంగా నడపగలరు. బైక్‌పై టెస్లా లోగో, ముందు భాగంలో కంపెనీ గుర్తు కూడా ఉన్నాయి. ఈ బైక్ ధర 225 డాలర్లు (సుమారు రూ.20 వేలు). సాధారణ పిల్లల బ్యాలెన్స్ బైక్‌లతో పోలిస్తే దీని ధర కొంత ఎక్కువే. అయితే ప్రీమియం బ్రాండ్ల బైక్‌లతో పోలిస్తే.. టెస్లా ధర కూడా అదే స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బైక్ సీటు ఎత్తును పిల్లల పెరుగుదలకు అనుగుణంగా ఐదు రకాలుగా మార్చుకునే సౌకర్యం ఉంది. గరిష్టంగా 35 కిలోల బరువు ఉన్న పిల్లలు దీనిని ఉపయోగించవచ్చు. బైక్‌ను అసెంబుల్ చేసుకోవడానికి అవసరమైన టూల్స్ కూడా ప్యాకేజీలో అందిస్తారు.

# ఐపీవో బాటలో మేక్ మై ట్రిప్ ఇండియా




ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫాం మేక్‌మైట్రిప్ ఇండియా (ఎంఎంటీ ఇండియా) పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉంది. ఇందుకు సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రాతిపదికన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. దీని ప్రకారం.. కంపెనీ మాతృ సంస్థ మేక్‌మైట్రిప్, దాని అనుబంధ సంస్థ ఐబిబో గ్రూప్ హోల్డింగ్స్ కొంత వాటాలను విక్రయించనున్నాయి. తద్వారా వచ్చిన నిధులు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడనున్నాయి. ఐపీవో అనంతరం కూడా మేక్‌మైట్రిప్‌కి ఎంఎంటీ ఇండియా అనుబంధ సంస్థగానే కొనసాగుతుంది.

# పార్లమెంట్‌లో 'ఆదాయ పన్ను సవరణ బిల్లు-2026'




కేంద్ర ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలకమైన ఆర్థిక సంస్కరణను చట్టరూపంలోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఇటీవల జారీ చేసిన ఒక అత్యవసర ఆర్డినెన్స్ స్థానంలో.. 'ఆదాయ పన్ను (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టేందుకు ముసాయిదాను సిద్ధం చేసింది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సెషన్‌లో ఈ బిల్లుకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా గత నెల (జూన్ 5, 2026) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆదాయ పన్ను (సవరణ) ఆర్డినెన్స్, 2026'ను భర్తీ చేయనున్నారు. పార్లమెంట్ సమావేశాలు లేని సమయంలో తక్షణ నివారణ చర్యల కోసమై రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 ప్రకారం లభించిన ప్రత్యేక అధికారాల ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వులతో ఈ ఆర్డినెన్స్‌ను అమల్లోకి తెచ్చారు. ఇది ఏప్రిల్ 1, 2026 నుంచి పాత తేదీతో వర్తిస్తుంది.ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం.. భారత ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం. గరిష్ట భద్రత గల ప్రభుత్వ బాండ్ల ద్వారా విదేశీ ఇన్వెస్టర్లకు లభించే వడ్డీ ఆదాయం, వాటి విక్రయాల ద్వారా వచ్చే మూలధన లాభాలపై ఆదాయ పన్ను నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వడం ఈ కొత్త బిల్లులోని ప్రధానాంశం. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ముడిచమురు ధరల్లో విపరీతమైన హెచ్చుతగ్గులు, ప్రపంచ మార్కెట్ల ఒడిదొడుకుల నేపథ్యంలో భారత్ ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. దీని ద్వారా ఒరగూరే ప్రయోజనాలు.. భారత సార్వభౌమ రుణ మార్కెట్‌ను (సావరిన్ డెట్ మార్కెట్) అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతం చేయడం.

# భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు.. టికెట్ ధర ఎంతంటే?

భారతదేశం ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుని.. వేగంగా ముందుకు దూసుకెళ్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండియాలో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించారు. ఈ రైలు పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో తయారవడం భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం. ఈ కథనంలో ఈ ట్రైన్ టికెట్ ధరలు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకుందాం. భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు హర్యానా రాష్ట్రంలోని జింద్ నుంచి సోనిపట్ వరకు నడుస్తుంది. మధ్యలో అనేక చిన్న స్టేషన్లలో ఆగుతూ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అయితే.. ఈ రైలులో ప్రయాణించడానికి అయ్యే ఖర్చు (టికెట్ ధర) కూడా చాలా తక్కువే కావడం గమనార్హం. రూ.5 నుంచి రూ.25 వరకు మాత్రమే టికెట్ చార్జీ ఉండటం వల్ల.. ప్రతి ఒక్కరూ ఈ రైలులో ప్రయాణించవచ్చు. దీన్నిబట్టి చూస్తే.. ఈ ట్రైన్ టికెట్ ప్రారంభ ధర.. సాధారణ ట్రైన్ ప్లాట్‌ఫామ్ టికెట్ రేటు (రూ.10) కంటే తక్కువ అని తెలుస్తోంది. ఈ రైలు సాధారణ డీజిల్ లేదా ఎలక్ట్రిక్ రైళ్ల మాదిరిగా కాకుండా.. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. అంటే ఈ ట్రైన్ ముందుకు వెళ్ళడానికి డీజిల్, ఎలక్ట్రిక్ (కరెంట్) అవసరం లేదు. హైడ్రోజన్ ఆక్సిజన్‌తో చర్య జరిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. తద్వారా ట్రైన్ ముందుకు వెళ్తుందన్నమాట. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే బయటకు వస్తుంది. తద్వారా గాలి కాలుష్యం తగ్గుతుంది.ఈ రైలులో మొత్తం పది కోచ్‌లు ఉంటాయి. ఒకేసారి సుమారు 2,600 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చు. ప్రయాణికుల భద్రత కోసం హైడ్రోజన్ లీకేజీ, పొగ, మంటలు, అధిక ఉష్ణోగ్రతలను



గుర్తించే ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా ఇందులో ఏర్పాటు చేశారు. హైడ్రోజన్ రైలు ప్రారంభం కావడంతో.. భారత్ జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన నిలిచింది. ఇది భారతదేశానికి గర్వకారణమైన విషయం. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని పర్యావరణహిత రైళ్లు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తే కాలుష్యం తగ్గడమే కాకుండా ఇంధన వ్యయం కూడా తగ్గుతుంది. ఈ దిశగా ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకుంటోంది.

# త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల



మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.



# హనుమాన్ మూవీతో బ్లాక్‌బస్టర్ కొట్టిన డైరెక్టర్ ప్రశాంత్ వర్మ

ప్రస్తుతం ఈ మూవీ సీక్వెల్ పనులతో బిజీగా ఉన్నారు. జై హనుమాన్ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో క్రేజీ అప్‌డేట్ వైరలవుతోంది.ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో రానా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో అశ్వద్ధామ పాత్ర రానా పోషించబోతున్నారని తెలుస్తోంది. ఈ పాత్రతో రానా కూడా చాలా రోజుల తర్వాత మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారని టాలీవుడ్ ఇండస్ట్రీ వర్గాల టాక్. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఈ సినిమాతో రానా మరోసారి పాన్ ఇండియా రేంజ్‌లో అలరించడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.





# ఓ లాయర్ పోరాటం

## కాజల్ అగర్వాల్, శ్రేయాస్

వ్యవసాయంలో పురుగుల మందు వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని దర్శకుడు చేతన్ డీకే రూపొందించిన సినిమా 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అన్నది ఈ సినిమా ఉపశీర్షిక. కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో చేతన్ సాగర్ బి. షిండే నిర్మించిన ఈ సినిమా జూలై 24న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. "ప్రతి మూడు కుటుంబాల్లో ఒకరు క్యాన్సర్‌తో పోరాడుతున్నారు, ప్రతి అరవై సెకన్లకు ఒకరు లేదా ఇద్దరు చనిపోతున్నారు" అంటూ డైలాగ్స్ లేకుండా కొన్ని నంబర్స్‌ను ఈ టీజర్‌లో చూపించారు. వ్యవసాయరంగంలో జరుగుతున్న కల్తీ, ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడటం, వ్యవసాయ రంగంలో వినియోగించే మందుల తయారీలో ఆయా కంపెనీల నిర్లక్ష్యం వంటి అంశాలను ఈ సినిమాలో చర్చించినట్లుగా విడుదలైన టీజర్ స్పష్టం చేస్తోంది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ లాయర్ పాత్రలో నటించారు.

# సుదీర్ఘ కాలం తరవాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బ్జడెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# అగ్ని.. విశ్వం త్యాగం వెరసి రాకా

'పుష్ప' ఫ్రాంచైజీతో పానిండియా ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో 'రాకా' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'పుష్ప2' తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్ పిక్చర్స్‌వారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు అట్లీ తనదైన శైలి మాస్ ఎలిమెంట్స్‌కు ఎమోషన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్, సైన్స్ ఫిక్షన్‌ను జోడించి ఈ కథను తయారు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది. త్వరలో గ్లింప్స్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. రాకా ప్రపంచాన్ని, దాని విజువల్ స్కేల్‌ని ఈ గ్లింప్స్ ద్వారా పరిచయం చేయనున్నారు.



# సింగ్ గీతం చేయడం నా అదృష్టం: దేవిశ్రీ ప్రసాద్

"సింగీతం శ్రీనివాసరావుగారు చేసినన్ని ప్రయోగాలు ఎవ్వరూ చేసి ఉండరు. 'సింగ్ గీతం' ప్రాజెక్ట్ చేస్తున్నామని మూడేళ్ల క్రితం ఆయన చెప్పినప్పుడు హ్యాపీ అనిపించింది. నాగ్ అశ్విన్‌గారు, స్వప్నగారు, వైజయంతి మూవీస్‌తో కలిసి ఈ సినిమా రూపొందడం మరింత ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను" అని దేవిశ్రీ ప్రసాద్ తెలిపారు. ఆయాన్, అహల్యా బమ్రా జంటగా శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్‌పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు. నేను సింగీతంగారికి వీరాభిమానిని. మా నాన్న సత్యమూర్తిగారిని కలవడానికి వచ్చినప్పుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. అలాంటిది సింగీతంగారితో కలిసి పని చేయడం ఒక ఆశీర్వాదంగా అనిపించింది. సింగీతంగారు ఎప్పుడూ ట్రెండ్‌కి తగ్గట్టు కథలు ఆలోచించలేదు. ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంటే అది ఇంతకు ముందు రానిది, తర్వాత కూడా రానిదిగా ఉంటుంది. 'పుష్పక విమానం' ఇప్పటికీ చాలా అడ్వాన్స్‌డ్ మూవీ. 'సింగ్ గీతం' ఐడియా కూడా అంతే కొత్తగా ఉంటుంది. ఒక గ్రామం మొత్తం మాట్లాడలేక కేవలం పాటల రూపంలోనే సంభాషించే కథ ఇప్పటివరకు రాలేదు. అది 'సింగ్ గీతం'లో కొత్తగా ఉంటుంది. నా కెరీర్‌లో సవాల్‌తో కూడుకున్న సినిమా ఇది. ఇది కేవలం కామెడీ సినిమా కాదు... అద్భుతమైన భావోద్వేగాలు కూడా ఉన్నాయి. కమల్‌హాసన్‌గారు సినిమా చూసి, 'ఇలాంటి సినిమాలో నేను కూడా భాగం కావాల్సింది' అనడం మాకు ఆనందాన్నిచ్చింది.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.